సంపుటము-1
సమావేశము-XXXII
నంబరు. 3

వెల : రూ. 5-00
05 ఫిబ్రవరి, 2019
మంగళవారము
విళంబి నామ సం.
మాఘ శు. 1

# ఆంధ్రప్రదేశ్ శాసనపరిషత్తు కార్యకలాపాలు
# ANDHRA PRADESH LEGISLATIVE COUNCIL DEBATES

## అధికార నివేదిక
## OFFICIAL REPORT

## విషయ సూచిక


| క్రమ సంఖ్య | విషయం | | పేజీ నం. |
|---|---|---|---|
| (1) | ప్రశ్నోత్తరాలు | ... | 01-35 |
| (2) | సభా సమక్షంలో ఉంచబడిన పత్రాలు: | ... | 36-36 |
| | 1.కార్మిక, ఉపాధి కల్పన, శిక్షణ మరియు కర్మాగారాల శాఖ మంత్రి శ్రీ పితాని సత్యనారాయణ, 2014-15 సంవత్సరానికి, ఆంధ్రప్రదేశ్ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్, 9వ వార్షిక నివేదిక ప్రతిని, 1956, కంపెనీల చట్టంలోని 619-ఎ నిబంధన క్రింద ఆవశ్యకమైన విధంగా ప్రతి సమర్పణ | | |
| | 2.పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డా. పి. నారాయణ, 2016-17 సంవత్సరానికి, ఆంధ్రప్రదేశ్ అర్బన్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్, 2వ వార్షిక నివేదిక ప్రతిని, 2013, కంపెనీల చట్టంలోని 394 సెక్షన్ కింద ఆవశ్యకమైన విధంగా ప్రతి సమర్పణ | | |
| | 3.జలవనరుల శాఖ మంత్రి శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు, 2016-17 సంవత్సరానికి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ లిమిటెడ్, 43వ వార్షిక నివేదిక ప్రతి, 2013, కంపెనీల చట్టంలోని 394(2) సెక్షన్ కింద ఆవశ్యకమైన విధంగా ప్రతి సమర్పణ | | |
| | 4.ఉప ముఖ్యమంత్రి (రెవెన్యూ) శ్రీ కె.ఇ.కృష్ణమూర్తి, 2014-15, 2015-16, 2016-17 సంవత్సరాలకు, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ వార్షిక నివేదికల ఒక్కొక్క ప్రతిని, 2013, కంపెనీల చట్టంలోని 394 సెక్షన్ కింద ఆవశ్యకమైన విధంగా ప్రతి సమర్పణ | | |
| | 5.రవాణా శాఖ మంత్రి శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు, రవాణా, రోడ్లు, భవనాలు (టిఆర్.1)1.11.2018 తేదీ నాటి జీ.ఓ.ఎం ఎస్ నెం.57లో, రవాణా, రోడ్లు, భవనాలు (టిఆర్.1)27.12.2018 తేదీ నాటి జీ.ఓ.ఎం.ఎస్. నెం.70లో జారీ చేసిన నోటిఫికేషన్ల ఒక్కొక్క ప్రతిని, 1963, ఆంధ్రప్రదేశ్ మోటారు వాహనాల పన్ను చట్టంలోని 9(2) సెక్షన్ కింద ఆవశ్యకమైన విధంగా ప్రతి సమర్పణ. | | |
| (3) | ప్రత్యేక ప్రస్తావన | ... | 36-37 |
| (4) | 2019-2020 సంవత్సరానికి వార్షిక ఆదాయ, వ్యయ పట్టిక (బడ్జెట్) (ఓట్ ఆన్ అకౌంట్) సమర్పణ | ... | 37-37 |

# ఆంధ్రప్రదేశ్ శాసనపరిషత్తు
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| చైర్మన్ | : | ----- |
| డెప్యూటీ చైర్మన్ | : | శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం |
| ఉపాధ్యక్షుల పేర్ల పట్టిక | : | శ్రీ చిక్కాల రామచంద్రరావు<br>శ్రీమతి పామిడి శమంతకమణి<br>డా. ఏ.ఎస్. రామకృష్ణ<br>శ్రీ ఆదిరెడ్డి అప్పారావు |
| కార్యదర్శి (ఇన్‌ఛార్జ్) | : | శ్రీ ఎమ్. విజయరాజు |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ కె. సత్యనారాయణరావు<br>శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ పి. వి. సుబ్బారెడ్డి<br>శ్రీ కె. రాజకుమార్<br>శ్రీమతి ఆర్. వనితారాణి<br>డా. వై. కామేశ్వరి<br>శ్రీ కె. వెంకటేశ్వరరావు<br>శ్రీ డి. జగన్‌మోహన్‌రావు<br>శ్రీ బి. ప్రభాకరరావు<br>శ్రీమతి కె. భారతి<br>శ్రీమతి డి. విజయకుమారి |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ ఆర్. శ్రీనివాసరావు |

* * * * *

ఆంధ్రప్రదేశ్ శాసనపరిషత్తు

మంగళవారం, 05వ తేది, ఫిబ్రవరి, 2019

----

(సభ ఉదయం 10.00 గంటలకు సమావేశమైనది)

( గౌరవ డెప్యూటీ ఛైర్మన్ అధ్యక్ష స్థానం వహించారు )

1. ప్రశ్నోత్తరాలు :

**MR. DEPUTY CHAIRMAN:** Now Question Hour, Question No.10866.

రాష్ట్రంలో పౌష్టికాహారం

ప్రశ్న నెం.10866(1)

శ్రీమతి పి. శమంతకమణి, ఎం.ఎల్.సి.

గౌరవనీయులైన ఆహార మరియు పౌరసరఫరాల శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) ఆహారంలో పోషక విలువలను పెంచేందుకు రాష్ట్రంలో వివిధ పథకాలను ప్రవేశపెట్టిన విషయం వాస్తవమేనా;

ఆ) పథకాలు అమలులో అవినీతి చోటుచేసుకున్న విషయం వాస్తవమేనా;

ఇ) అయితే, బాధ్యులుగా కనుగొనబడిన అధికారులు ఎంతమంది; జిల్లా వారీగా ప్రభుత్వం చేపట్టిన చర్య వివరాలు ఏమిటి?

గౌరవనీయులైన పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి (శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు):

అ) ఆహారంలో పోషక విలువలను పెంచేందుకు, రాష్ట్రంలోని ప్రజా పంపిణీ వ్యవస్థలో చక్కెర, కందిపప్పు, రాగులు, జొన్న, డబుల్ ఫోర్టిఫైడ్ సాల్ట్‌ల పంపిణీని ప్రవేశ పెట్టడమయింది.

ఆ) అటువంటి కేసులను వేటినీ గుర్తించలేదు.

ఇ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

**శ్రీమతి పామిడి శమంతకమణి (శాసనసభా నియోజకవర్గం):** అధ్యక్షా, నేను అడిగిన ప్రశ్న ఆహార పోషక విలువలను పెంచుటకు వివిధ పథకాలను ప్రవేశపెట్టిన విషయం వాస్తవమేనా అని అడిగాను. అధ్యక్షా, ఈరోజు రెడ్డి సుబ్రహ్మణ్యంగారు ఉదయాన్నే లేస్తూ భార్యను కాఫీ అడిగారు. భార్య కాఫీ తెచ్చి ఇచ్చింది. ఒక గుటక తాగగానే ఛీ ఈ కాఫీ ఏంటీ ఇలా తగలబడింది అన్నారు. ఏంటండీ అలా అన్నారు, అపశకునం మాటలూ, అలా అనకండీ నేను ఏం చేయగలను? పాలవాడు పాలు అలా పోశాడు అని వారి భార్య అన్నారు. పాలు పోషకాహారం, ఎముకలు బలంగా ఉండాలంటే బాగా ఆరోగ్యంగా ఉండాలంటే ఉదయం మరియు రాత్రి పాలు తాగాలి. కానీ పాలల్లో ఇంత కల్తీ ఉంటే ఎలా అధ్యక్షా? ఉదయం లేచినప్పటి నుండి మా మహిళలు ఈ కల్తీ ఆహార సమస్యను ఎదుర్కొంటున్నారు. కారం, పసుపు, కందిబేడలు, వంటనూనె అన్నీ కల్తీలే ఉంటున్నాయి. రాజధాని అయిన విజయవాడ కల్తీకి అడ్డాగా నిలిచింది. బ్రాండెడ్ కంపెనీల పేరుతో కల్తీ నూనెలు అమ్ముతున్నారు. నెయ్యి కూడా కల్తీ అవుతుంది. అన్నీ కల్తీ జరుగుతుంటే మానవుని జీవన ప్రమాణం ఎంత దిగజారిపోతుందో ఒక్కసారి ఆలోచన చేయాలి. అనంతపురంలో ఫుడ్ కమిటీతో సందర్శించినప్పుడు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు చాలా తక్కువ మంది ఉన్నారు, డిపార్టుమెంట్లలో చాలా పోస్టులు భర్తీ చేయాల్సి ఉన్నది, కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నారు, జిల్లా అంతటా తిరిగి కల్తీ చేసే వారిని పట్టుకోవడం కష్టంగా ఉందని అక్కడి వారు చెప్పారు. హోటల్స్‌లో చూస్తే బూజు పట్టిన చికెన్, మటన్‌కు రాత్రిపూట గరంమసాలాలు కలిపి వేడివేడిగా పెడితే అవి తిని రాత్రంతా పది సార్లు బాత్‌రూమ్‌కు, వెళ్లాల్సిన పరిస్థితి వస్తోంది. దీనిని ఎవరు కంట్రోల్ చేస్తారు?

ఒకవైపు పోషకాహారం తినాలి, మీరు, మీ పిల్లలు ఆరోగ్యంగా ఉండాలి అంటారు. కానీ మరో వైపు కల్తీ ఆహారంతో ప్రజలు బాధపడుతున్నారు. దీనికి అడ్డు ఎక్కడుంటుంది? నేను మంత్రిగారిని కోరేదేమంటే డిపార్టుమెంటల్‌గా రెవ్యూ నిర్వహించి ఎన్ని ఖాళీలు ఉన్నాయి, ఎక్కడెక్కడ అవినీతి జరుగుతుందనేది చూడండి. ప్రతిరోజూమన ం పత్రికలలో, టీవీలలో కల్తీ ఆహారానికి సంబంధించిన వార్తలు చూస్తూనే ఉన్నాము. అలా కల్తీ చేసే వారి మీద ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు? మా మహిళల ఆవేదన వినండి అధ్యక్షా. మేము భర్తల ఆరోగ్యాన్ని, పిల్లల ఆరోగ్యాన్ని, ఇంట్లో పెద్దవారి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. ఈ కల్తీ ఆహారాన్ని మేమే తయారు చేసి, ఇంట్లో అందరికీ స్లోపాయిజన్ లాగా పెడుతున్నట్లుంది. దయచేసి ప్రభుత్వం ఈ విషయంలో కఠినమైన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వంలో ఉన్న మంత్రులు, డిపార్టుమెంట్ అధికారులు కఠినమైన చర్యలు తీసుకుని కల్తీ చేస్తున్న ఇద్దరుముగ్గురిని పట్టుకుని కఠినశిక్షలు విధిస్తే మిగిలిన వాళ్లు భయపడతారు. అలా కాకుండా చూసిన మరుసటి రోజుకే ఫైలు మాయం అయితే ఎలా అధ్యక్షా? దీని మీద ఎవరు చర్యలు తీసుకుంటారు? దయచేసి ఈ విషయంలో మంత్రిగారు కఠిన చర్యలు తీసుకోవాలి. ఆహారంలో పోషకవిలువలు తగ్గకుండా, కల్తీ లేని మంచి ఆహారాన్ని ప్రజలకు అందజేయాల్సిందిగా కోరుతున్నాను.

**శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు:** అధ్యక్షా, ప్రశ్న వేరే మంత్రిగారికి సంబంధించినది, సమాధానం నన్ను అడుగుతున్నారు. ఒక సమావేశం నిర్వహిస్తామని నా ప్రక్కనున్న వైద్యఆరోగ్య శాఖ మంత్రిగారు చెబుతున్నారు. గౌరవ సభ్యురాలు అడిగినవన్నీ నా పరిధిలోకి రావు, అన్నీ వైద్యఆరోగ్య శాఖకు సంబంధించినవి. గౌరవ సభ్యురాలికి నేను తెలియజేసేదేమంటే నాప్రక్కనున్న మంత్రిగారు ఒక సమావేశం నిర్వహించి కల్తీ ఆహారం ప్రోత్సహించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. తప్పకుండా గౌరవ సభ్యురాలు శ్రీమతి పి. శమంతకమణి గారు చెప్పిన విషయాలపై చర్యలు తీసుకుంటామని గౌరవ మంత్రివర్యులు చెబుతున్నారు. నేను కూడా దీనికి సంబంధించి ప్రభుత్వం చేపట్టిన చర్యలు కొన్ని చెప్పాలి.

గౌరవ ముఖ్యమంత్రిగారి సూచన మేరకు ఆహారపు అలవాట్లు మార్చాలనే ఉద్దేశంతో ఈరోజు మనం రాగులు, జొన్నలను కూడా చౌకధరల దుకాణాల ద్వారా సరఫరా చేస్తున్నాము. పేద కుటుంబాల వారికి ఆహార అలవాట్లు మార్పు చేసేందుకు పోషక విలువలు గల ఆహార పదార్థాలు అందించడానికి రాష్ట్రంలో రాగులు, జొన్నల పంపిణీ ప్రారంభించడం జరిగింది. రాగులు ఒక కార్డుకు మూడు కేజీల చొప్పున కేజీ రూ.1/-కి ఇస్తున్నాము. అదేవిధంగా 14,459.542 మెట్రిక్ టన్నులు ఇప్పటివరకు ఇచ్చాము. జొన్నలు కూడా ఒక కార్డుకు రెండు కేజీల చొప్పున కేజీ రూ.1/-కి ఇస్తున్నాము. దాదాపు 9,936మెట్రిక్ టన్నుల జొన్నలు ఇప్పటివరకు పంపిణీ చేయడం జరిగింది. అదేవిధంగా రక్తహీనత, ఐరన్ లోపం తగ్గించుటకు అక్టోబరు 2018 నుండి డబుల్ ఫోర్టిఫైడ్ సాల్ట్‌ను కూడా ప్రజాపంపిణీ ద్వారా సరఫరా చేస్తున్నాము. ముందుగా పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు మరియు కర్నూలు జిల్లాలలో ప్రారంభించబడి తదుపరి అన్ని జిల్లాలకు విస్తరింపచేయడం జరుగుతోంది. ఇప్పటికి 919టన్నుల డబుల్ ఫోర్టిఫైడ్ సాల్ట్‌ను పంపిణీ చేయడం జరిగింది. సూక్ష్మపోషక లోపాల నివారణకు మధ్యాహ్న భోజన పథకం మరియు అంగన్‌వాడీ కేంద్రాలకు విటమిన్లు మరియు ఖనిజాలు మిళితం చేసి బలవర్ధకం కలిగిన బియ్యంను పంపిణీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. టాటా ట్రస్టు సహకారంతో కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాలలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రస్తుతం 5,960.565 మెట్రిక్ టన్నుల ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ఇప్పటివరకూ పంపిణీ చేయడం జరిగింది. ఇవన్నీ కూడా ఆహారపు అలవాట్లు మార్చి ప్రజల ఆరోగ్యం కోసం గౌరవ ముఖ్యమంత్రి గారి సలహా మేరకు ఈ కార్యక్రమాలను అమలుచేయడం జరుగుతోంది.

**మిస్టర్ డెప్యూటీ చైర్మన్:** సమాధానం మీ శాఖ నుండి వచ్చింది. అందుకే మీకు పోస్ట్ చేశారు.

**శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు:** అధ్యక్షా, కానీ గౌరవ సభ్యురాలు అడిగిన వివరాలన్నీ వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించినవి.

**మిస్టర్ డెప్యూటీ చైర్మన్:** సమాధానం మీరు పంపించారు కాబట్టి మిమ్మల్ని అడిగారు.

**శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు:** ప్రశ్నోత్తరాలు ప్రశ్న కొంచెం కన్‌ఫ్యూజన్‌గా ఉంది.

**శ్రీమతి పామిడి శమతకమణి:** ఫుడ్ అడ్వైజరీ పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రిగారికి సంబంధించినదా కాదా అధ్యక్షా!

**శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు:** ఫుడ్ అండ్ సేఫ్టీ పూర్తిగా మెడికల్ అండ్ హెల్త్ పర్యవేక్షణ లో ఉంది. మా శాఖకు ట్రాన్స్‌ఫర్ చేయమని సి.ఎస్.గారు చెప్పారు. కానీ వారు అక్కడే ఉంటామన్నారు. అందుకే అది ఇంకా మెడికల్ అండ్ హెల్త్ క్రింద ఉంది.

**శ్రీమతి పామిడి శమంతకమణి:** అధ్యక్షా, రాగులు, జొన్నలు మా రాయలసీమ పంటలు. కోనసీమలో వాటిని ఎవరు తింటారు?

**శ్రీ ఎన్.ఎమ్.డి.ఫరూక్:** చైర్మన్ గారూ, ఈ ప్రశ్న మంత్రిగారికి సంబంధం లేదు. ఫుడ్ అండ్ సేఫ్టీ మెడికల్ అండ్ హెల్త్ పరిధిలో ఉంది. ఫుడ్, సివిల్ సప్లైస్ మంత్రిగారి వద్ద ఉంటాయి. అందుకని ప్రశ్న వారికి వచ్చింది కాబట్టి వారు సమాధానమిచ్చారు. ప్రశ్న మాకు వచ్చి ఉంటే మేము సమాధానం చెప్పేవాళ్లం. జాయింట్‌గా కావాలంటే ఒక సమావేశం నిర్వహించి దానికి సంబంధించిన చర్యలు తీసుకుంటాము. స్పెసిఫిక్‌గా ఏవైనా కేసులుంటే చెప్పండి, తగు చర్యలు తీసుకుంటాము.

**మిస్టర్ డెప్యూటీ చైర్మన్:** బాలసుబ్రహ్మణ్యం గారూ, సింగిల్ సప్లిమెంటరీ వేయండి.

**శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం (ఉపాధ్యాయ నియోజకవర్గం – చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు):** అధ్యక్షా, ఇది సప్లిమెంటరీ కాదు. ఇది చాలా ముఖ్యమైన విషయం. నేను ఈమధ్య స్విమ్స్‌లో మెడికల్ ఆంకాలజీ డిపార్టుమెంట్‌కు వెళ్లాను. ఆయన ఒకమాట చెప్పారు. రాబోయే 15 సంవత్సరాలలో మనదేశంలో ప్రతి ఒక్కరికి ఏదో ఒక జబ్బు వచ్చి ఉంటుంది. అది డయాబెటిక్ అయినా అయి ఉంటుంది లేదా కేన్సర్ అయినా అయి ఉంటుంది అన్నారు. అందరికీ ఈ రెండింటిలో ఏదో ఒక జబ్బు వచ్చే పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. ఎన్.టి.ఆర్.వైద్య సేవ చూడండి, సి.ఎం.రిలీఫ్ ఫండ్ చూడండి కేన్సర్ క్లెయిమ్స్ ఎన్ని వస్తున్నాయో మీరు చూడొచ్చు. కేన్సర్, కిడ్నీకి సంబంధించిన కేసులు ఎక్కువగా వస్తున్నాయి. కిడ్నీ జబ్బులు ఒకరకం.

ఉ.10.10

అధ్యక్షా, మన ఆహారపు అలవాట్ల కారణంగానే కేన్సర్, కిడ్నీ సమస్యలు వస్తున్నాయనేది నూటికి నూరుపాళ్లు వాస్తవం. ఇది చాలా పెద్ద సమస్య. అందువలన ట్రెండ్ ఎలా ఉందనే దాని మీద ఆరోగ్యశాఖమంత్రిగారు సీరియస్‌గా మీటింగ్ పెట్టి ఏమి చేస్తే బాగుంటుందనేదాని మీద చర్చిస్తే, మాలాంటి వారందరం కూడా వస్తాము. ఆవిధంగా చేస్తే ఎక్కువ ఉపయోగకరంగా ఉంటుంది. మిగతా ఏమి చర్యలు తీసుకోవాలనేది శాఖాపరంగా చూడవచ్చు కానీ ఈ బాధ్యతలు మాత్రం ఆరోగ్యశాఖ తీసుకోవాలి.

**శ్రీ ఎన్.ఎం.డి.ఫరూక్:** అధ్యక్షా, తమరి ఆదేశాల ప్రకారం జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి దీనిని పరిష్కరిస్తాం.

<u>పౌర సరఫరాలలో ఇ–పోస్ వ్యవస్థ</u>

ప్రశ్న నెం.10925(2)

సర్వశ్రీ కోలగట్ల వీరభద్ర స్వామి, ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్, వెన్నపూస గోపాల్ రెడ్డి, ఎం.ఎల్.సీలు,

గౌరవనీయులైన పౌరసరఫరాలశాఖా మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

ఈ) రాష్ట్ర ప్రభుత్వంచే ప్రవేశపెట్టబడిన ఇ–పిఓఎస్ (ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్) పద్ధతి మంచి ఫలితాలను ఇస్తున్నదా;

ఉ) ఇ–పిఓఎస్ పద్ధతిలో సాంకేతిక లోపం వలన లబ్ధిదారులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారనే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకురావడమయిందా;

ఊ) ప్రస్తుతం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేస్తున్నట్టి సరకుల వివరాలేమిటి?

గౌరవనీయులైన పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలశాఖా మంత్రి (శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు):

ఈ) అవునండీ.

ఉ) పంపిణీ సమయంలో, ఏదేని సాంకేతిక సమస్యలు ఎదురైతే, ఎన్ఐసి మరియు విజన్ టెక్ సాంకేతిక బృందాలు సత్వరమే ఇబ్బందులను పరిష్కరిస్తున్నాయి.

బయోమెట్రిక్ ధృవీకరణలో విఫలమైన కేసులకు, ఫ్యూజన్ ఫింగర్/ఐరిస్ ధృవీకరణ ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ జరుగుతున్నది. రెండూ విఫలమైనట్లయితే, గ్రామ రెవెన్యూ అధికారుల ధృవీకరణ ద్వారా సరఫరా చేయబడుతున్నాయి. ఈ విధంగా కార్డుదారులకు నిత్యావసర నరకులను పంపిణీ చేయటానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోబడుతున్నాయి.

| ఊ) | | |
|---|---|---|
| వరుససంఖ్య | అనుసూచిత సరకు పేరు | పంపిణీ స్కేలు |
| 1. | ప్రాధాన్యత/తెల్లకార్డులకు బియ్యం | రేషన్ కార్డులోని ఒక్కొక్క యూనిట్‌కు 5 కేజీలు |
| 2. | ఏఏవై కార్డులకు బియ్యం | ఒక్కొక్క కార్డుకు 35 కేజీలు |
| 3. | అన్నపూర్ణ కార్డులకు బియ్యం | ఒక్కొక్క కార్డుకు 10 కేజీలు |

| | | |
|---|---|---|
| 4. | పంచదార | ఒక్కొక్క ఏఏవై కార్డుకు 1 కేజీ మాత్రమే, ఏఎన్‌పి, డబ్ల్యుఏపి/పిహెచ్‌హెచ్ కార్డుదారులకు 1/2 కేజీ |
| 5. | గోధుమపిండి | ఒక్కొక్క కార్డుకు 1 కేజీ |
| 6. | కందిపప్పు | ఒక్కొక్క బిపిఎల్ కార్డుకు 2 కేజీలు |
| 7. | రాగులు | ఒక్కొక్క కార్డుకు 3 కేజీల వరకు (ఏఏవై - పిహెచ్‌హెచ్/ డబ్ల్యుఏపి కార్డుదారులకు మాత్రమే బియ్యానికి బదులుగా) |
| 8. | జొన్న | ఒక్కొక్క కార్డుకు 2 కేజీల వరకు (ఏఏవై - పిహెచ్‌హెచ్/ డబ్ల్యుఏపి కార్డుదారులకు మాత్రమే బియ్యానికి బదులుగా) |
| 9. | డి.ఎఫ్ ఉప్పు | ఒక్కొక్క బిపిఎల్ కార్డుకు 1 కేజీ చొప్పున పంపిణీ చేయడం జరుగుతుంది. |

**శ్రీ గౌనివారి శ్రీనివాసులు (నామినేటెడ్):** అధ్యక్షా, ఈపాస్ విధానం అనేది చాలా మంచి ఫలితాలు ఇస్తున్న విషయం వాస్తవమే. అయినప్పటికీ కొన్ని చోట్ల Thumb impression సరిగా పడడంలేదనేది, మరికొన్ని చోట్ల Iris కూడా పనిచేయడంలేదనే సమస్యలు వస్తున్న మాట వాస్తవం. మేము గ్రామపర్యటన జన్మభూమి కార్యక్రమం, పసుపు కుంకుమ కార్యక్రమం, పించన్ల పంపిణీ కార్యక్రమానికి వెళ్లిన సందర్భాలలో చాలా చోట్ల లబ్ధిదారులు బియ్యం సక్రమంగా పంపిణీ చేయడం లేదని చెబుతున్నారు. జిల్లా కలెక్టర్లయితే అక్కడ ఉండే సెక్రటరీలు సంతకాలు చేస్తే ఇస్తారని చెబుతున్నారు. కానీ ఇంకా కొన్ని చోట్ల అది అమలు కావడంలేదు. దానిపై తప్పకుండా చర్యలు తీసుకోవాలని గౌరవ మంత్రివర్యులను కోరుతున్నాను.

**శ్రీ చిక్కాల రామచంద్రరావు (స్థానిక సంస్థలు – తూర్పుగోదావరి):** అధ్యక్షా, మంత్రిగారు చెప్పినట్లు ఈ పోస్ అనేది చాలా మంచి కార్యక్రమం. Public Distribution Systemలో ప్రభుత్వం చాలా మంచి సిస్టమ్‌ను అమలు చేస్తున్నందుకు ధన్యవాదములు తెలియజేస్తున్నాను. అయితే దీనిలో కొన్ని లోపాలున్నాయి. మంత్రిగారు VROకు authentication ఇచ్చినట్లు చెప్పారు. ఒక్కొక్కసారి వీఆర్‌వో రావడం ఆలస్యం అవుతున్నందున బియ్యం, ఇతర సరకులు సరఫరా చేయడంలో ఆలస్యం జరుగుతుంది. Single ladies వృద్ధులైన మహిళల thumb impression, iris పనిచేయడంలేదు. వారికి రేషన్ ఇవ్వడానికి వీఆర్‌వోలకు అప్పగించారు. మేము కాదనడంలేదు. కుటుంబంలో ఉన్నవారు ఎవరు వెళ్లినా thumb impression, iris గానీ old age వారున్నా బాగానే ఉపయోగపడుతున్నాయి. కానీ సింగిల్‌గా ఉన్న వృద్ధ మహిళలకు సరిగా పనిచేయడం లేదు. అలాంటి వారు గ్రామానికి

5 నుండి 30మంది వరకూ ఉండవచ్చు. వారికి వీఆర్‌వో వచ్చి ఇవ్వాలంటే ఆలస్యం జరుగుతుంది. అందువలన వారు ఇబ్బందిపడుతున్నారు. అందుగురించి అలాంటి వృద్ధులు, సింగిల్ మహిళలు thumb impression, iris పనిచేయని వారు ఎవరైతే ఉన్నారో ఆ కొంతమందికి రేషన్ ఇవ్వడానికి అక్కడ డీలర్‌కు అప్పగిస్తే బాగుంటుందనే సూచనను తమరి దృష్టికి తీసుకువస్తున్నాను.

అధ్యక్షా, రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసే బియ్యం, పంచదార, గోధుమలు, కందిపప్పు, రాగులు, జొన్నలు రాష్ట్రవ్యాప్తంగా ఎంత క్వాంటిటీ ఇస్తున్నారు? ఎన్ని రేషన్‌కార్డులు ఉన్నాయి? ప్రభుత్వానికి ఎంత ఖర్చవుతుంది అనే వివరాలు తెలియజేయాలని తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు:** అధ్యక్షా, గౌరవసభ్యులు గౌనివారి శ్రీనివాసులుగారు, చిక్కాల రామచంద్రరావుగారు రేషన్‌కార్డులకు సంబంధించి, రేషన్ తీసుకోవడానికి పెట్టిన బయోమెట్రిక్ గురించి మాట్లాడడం జరిగింది. బయోమెట్రిక్‌లో ఎక్కడైతే మిస్‌మ్యాచెస్ వచ్చాయో వాటన్నింటినీ ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాము. 1100లో ఒకసారి బయోమెట్రిక్ వేసి మిస్‌మ్యాచ్ అయితే ఇక్కడ రిజిస్టర్ అవుతుంది. ఎన్ని బయోమెట్రిక్‌లు మిస్‌మ్యాచ్ అయ్యాయో ఎప్పటికప్పుడు సమాచారాన్ని తీసుకుని వారికి తరవాత రెండు, మూడు రోజులు 16,17,18తేదీలలో బయోమెట్రిక్ మిస్‌మ్యాచ్ అయిన వారికి ప్రత్యేకంగా మరలా పంపిణీ చేయడం జరిగింది. గౌరవ సభ్యులు చెప్పినట్లు బయోమెట్రిక్‌లో thumb impression, iris విధానం రెండూ ఫెయిల్ అయినప్పుడు VRO authenticationతో ఇస్తున్నాము. గౌరవ ముఖ్యమంత్రిగారు కలెక్టర్ల సదస్సులో సూచన ప్రాయంగా ఒక నిర్ణయం తీసుకోవడం జరిగింది. గౌరవసభ్యులు చిక్కాల రామచంద్రరావుగారు డీలర్‌కు కొంత వెసులుబాటు ఇస్తే బాగుంటుందని చెప్పారు. 5శాతం కమీషన్ డీలర్‌కు ఇవ్వడానికి ప్రభుత్వ పరిశీలనలో ఉంది. కలెక్టర్లకాన్ఫరెన్సులో కూడా వచ్చింది. గౌరవముఖ్యమంత్రిగారు కూడా దాని మీద ఒక డైరెక్షన్ కూడా ఇచ్చారు. బయోమెట్రిక్ పని చేయనప్పుడు, ఆ సమయంలో సర్వర్ పనిచేయనప్పుడు 5శాతం వరకూ డీలర్ల రెస్పాన్సిబిలిటీ మీద ఇచ్చేటట్లుగా ప్రభుత్వం ఆలోచిస్తుంది. ఆవిధంగా CSDT, ASO authentication ద్వారా కూడా పంపిణీ చేయడం జరుగుతోంది. ఎక్కడి నుండి అయినా ఫిర్యాదు వచ్చినా, వీఆర్‌వో అందుబాటులో లేకపోయినా ఆ డీలరు పరిధిలో, మండల పరిధిలో ఉన్న CSDT, ASO authentication ద్వారా ఇచ్చే అవకాశం ఉంది.

అధ్యక్షా, కిలో బియ్యం రూ.32కు కొని రూ.1కు పంపిణీ చేస్తున్నాము. అదే విధంగా కందిపప్పు రూ.60కు కొని రూ.40కు, జొన్నలు రూ.28కు కొని రూ.1కి, రాగులు రూ.23కు కొని రూ.1కు, పంచదార రూ.40కు కొని అరకిలోరూ.10కు పంపిణీ చేస్తున్నాము. ఆ డిఫరెన్సు అమౌంట్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తున్నాయి. బియ్యం పంపిణీ చేసే కార్డులు కోటీ 47 లక్షలు ఉంటే కేంద్ర ప్రభుత్వం 90లక్షల కార్డులకు మాత్రమే సబ్సిడీ భరిస్తోంది. మూడు రూపాయలు చొప్పున మనకు ఇస్తోంది. మిగిలినవన్నీ రూ.32కు కొనుగోలు చేసి రూ.1కే ప్రజాపంపిణీ

వ్యవస్థ ద్వారా సరఫరా చేయడం జరుగుతోంది. కొనుగోలు ధర ఎంత ఉంది. వినియోగదారులకు కార్డుహోల్డర్స్‌కు ఎంత ఇస్తున్నామనేది కూడా స్పష్టంగా తెలియజేయడమైనది.

## ప్రకాశం జిల్లా కనిగిరిలో నిమ్జ్

ప్రశ్న నెం.10893(3)

శ్రీ కరణం బలరామ కృష్ణమూర్తి, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన పరిశ్రమలు మరియు వాణిజ్యశాఖా మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

ఎ) ప్రకాశం జిల్లా కనిగిరి నియోజక వర్గంలోని వెనుకబడిన ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వ సంస్థ "నిమ్జ్" ను ఏర్పాటు చేస్తున్న విషయం వాస్తవమేనా;

బి) సదరు సంస్థ యొక్క భూసేకరణ ప్రక్రియ ప్రస్తుతం ఏ దశలో ఉంది?

**గౌరవనీయులైన పరిశ్రమలు మరియు వాణిజ్య, ఫుడ్ ప్రాసెసింగ్, అగ్రి బిజినెస్, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్‌ల శాఖ మంత్రి (శ్రీ ఎన్.అమరనాథ్ రెడ్డి):**

ఎ) అవునండీ.

బి) i. ప్రకాశం జిల్లా పామూరు మండలంలోని ఐదు(5) గ్రామాలలో మరియు పెదచెర్లోపల్లి మండలంలోని ఒక గ్రామంలో రూ.43,500 కోట్ల అంచనా వేసిన పెట్టుబడితో 14,231 ఎకరాల విస్తీర్ణంలో 2,05,000 మందికి ప్రత్యక్ష ఉపాధి మరియు 2,92,000 మందికి పరోక్ష ఉపాధిని ఆశించి జాతీయ పెట్టుబడి మరియు తయారీ జోన్ (నిమ్జ్)ను అభివృద్ధి చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించింది.

ii. మొత్తం 14,231 ఎకరాల భూమిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 18 నెలలలోపు ఎస్‌పివికి బదిలీ చేయాలనే షరతుకు లోబడి, ఆంధ్రప్రదేశ్ లోని ప్రకాశం జిల్లాలో జాతీయ పెట్టుబడి మరియు జోన్ (నిమ్జ్)ను అభివృద్ధి చేయడం కోసం 06-10-2015న కేంద్ర ప్రభుత్వం తుది ఆమోదం తెలిపింది.

iii. ప్రాజెక్టును అమలు చేయడం కోసం ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సౌకర్యాల సంస్థ లిమిటెడ్ (ఎపిఐఐసి) నోడల్ ఏజెన్సీగా ఉన్నది.

iv. సిఐఎన్ నెం.యు99000ఎపి2016ఎస్.జిసి098136 ద్వారా, 2013 కంపెనీల చట్టం ప్రకారం 2016, జనవరి 22న నూటికి నూరు శాతం అనుబంధ లిమిటెడ్ కంపెనీగా ఎస్.పివి – "ప్రకాశం నేషనల్ ఇండస్ట్రియల్ - మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ లిమిటెడ్" ను ఎపిఐఐసి నమోదు చేసింది.

v. ప్రస్తుతానికి, ప్రకాశం జిల్లాలోని నిమ్జ్ అభివృద్ధి కోసం ఉద్దేశించిన మొత్తం భూమి విస్తీర్ణం 14,231 ఎకరాలుగా ఉన్నది. అందులో 1723.33 ఎకరాలు ఎపిఐఐసి ఆధీనంలో ఉన్నది.

ఉ.10.20

**శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాద్** : అధ్యక్షా, ఈ National Investment and Manufacturing Zone (NIMZ) అనేది ప్రకాశం జిల్లా కనిగిరిలో ఉంది. ఇది చాలా వెనుకబడిన ప్రాంతం. ఈ ప్రాంతంలో ఇటువంటి సంస్థను ఏర్పాటు చేసి, ఇక్కడి ప్రజలకు కనీసం ఉపాధి అవకాశాలను కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వంపైన ఉన్నది. ఈ మధ్య కాలంలో పరిశ్రమలను నెలకొల్పడం వలన ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరిగాయనే విషయన్ని చూడడమే కాకుండా, పత్రికల ద్వారా కూడా తెలుసుకుంటున్నాము. ఈ మధ్య కియా కార్ల కంపెనీ అనంతపురానికి రావడం వలన ఆ ప్రాంత ప్రజలకు చాలా లబ్ధి చేకూరిందనే విషయాన్ని కూడా తెలుసుకుంటున్నాము. అయితే, కొన్ని రాజకీయ పక్షాలు కియా కార్లలో అసలు ఏం లేదని, ఇంకా ఆ కంపెనీ ప్రారంభం కాలేదని, లేకపోతే ప్రకాశం వంటి వెనుకబడిన జిల్లాలలో కూడా ఎటువంటి కార్యక్రమాలు చేయడం లేదని, పరిశ్రమల వలన ఎటువంటి లాభాలు చేకూరడం లేదని, ఎటువంటి ఉపాధి అవకాశాలు కూడా లభించడం లేదని కొన్ని రాజకీయ పక్షాలు ముఖ్యంగా ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

అధ్యక్షా, తమ ద్వారా గౌరవ మంత్రిగారిని అడిగేదేమిటంటే, వారు ప్రభుత్వం ద్వారా ఎటువంటి ఉద్యోగ అవకాశాలను కల్పించారు? ముఖ్యంగా ఈ వెనుకబడిన ప్రాంతాలలో చాలా మంది ప్రజలు ఉంటారు. అక్కడ అనేక రకాల సమస్యలు ఉంటాయి. అక్కడ నీటి సమస్యలు, ఉద్యోగాలు లేకపోవడం, పంటలకు కూడా అవకాశాలు ఉండవు. కొన్ని ప్రాంతాలలో వ్యవసాయ పంటలు కూడా పండవు. మరి అటువంటి ప్రాంతాలలో ఈ ప్రభుత్వం అక్కడ ఉన్న ప్రజలకు ఎటువంటి ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నదో తెలియజేయవలసిందిగా తమ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ యండవల్లి శ్రీనివాసులు రెడ్డి (పట్టభద్రుల నియోజకవర్గం – చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు)** : అధ్యక్షా, చాలా సంతోషం. వెనుకబడిన ప్రాంతమైన ప్రకాశం జిల్లాకు జాతీయ ప్రాజెక్టును తెచ్చిపెట్టినందుకు ఈ రాష్ట్రప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. 2010వ సంవత్సరంలో చిత్తూరు, నెల్లూరు జిల్లాల సరిహద్దుల్లో ఉండే మన్నవరం ప్రాంతానికి ఒక కేంద్ర పరిశ్రమను ఆనాటి ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. అక్కడ ప్రధాన ఉత్పత్తులైన టర్బైన్స్, బాయిలర్స్ ఇంకా కొన్ని ఎలక్ట్రానిక్స్ పరికరాల యంత్రాల తయారీకి సంబంధించి దాదాపు 700 ఎకరాల స్థలాన్ని ఏర్పేడు–శ్రీకాళహస్తి సమీపంలో కేటాయించడమే కాకుండా, రూ.6,500కోట్లతో ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. అక్కడ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌ను కూడా దాదాపు రూ.5కోట్లతో కట్టారు. కానీ, అక్కడ కేవలం 48 మంది ఉద్యోగులు, దాదాపు రూ.45కోట్లను మాత్రమే విడుదల చేశారు. మొత్తం మీద అక్కడ 20,000 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు ప్రభుత్వ పక్షాన వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆ ప్రాజెక్టు ఏ స్థాయిలో ఉంది? దానిని

పునరుద్ధరించడానికి మన రాష్ట్రం నుంచి పరిశ్రమల శాఖా మంత్రిగారు ఏయే ప్రయత్నాలు చేస్తున్నారో వివరించవలసిందిగా తమ ద్వారా కోరుతున్నాను.

**శ్రీ ఎన్. అమర్‌నాథ రెడ్డి**: అధ్యక్షా, సభ్యులు అడిగిన ప్రశ్న నిమ్జ్‌కు సంబంధించినది. అది కేంద్రప్రభుత్వ భాగస్వామ్యంతో ఏర్పాటు చేసే సంస్థ. దీనికి సంబంధించే కాకుండా, గౌరవ సభ్యులు ఉద్యోగావకాశాల గురించి కూడా అడిగారు. లార్జ్ అండ్ మెగా పరిశ్రమల క్రింద 2,50,000ల మందికి, ఎంఎస్‌ఎంఇ క్రింద 3,30,000 మందికి ఇప్పటివరకు ఈ రాష్ట్రంలో ఉద్యోగావకాశాలను కల్పించడం జరిగింది. అదేవిధంగా ఈ సంస్థకు సంబంధించి చూస్తే నిజంగా బాధాకరమైన సంఘటనలు, సందర్భం ఏమిటంటే – కేంద్రప్రభుత్వం ఈ రాష్ట్రానికి రావలసినటువంటి ఆ ప్రాజెక్టులను పూర్తిగా రానివ్వకుండా చేస్తున్నదని క్లియర్‌కట్‌గా వాస్తవాలను చెప్పవలసిన అవసరం ఎంతైనా ఉంది. మీరు నాకు కొంత సమయం ఇస్తే అన్ని వివరాలు చెపుతాను.

**శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాద్ (మైకులేదు)**: అధ్యక్షా, వారికి సమయం ఇవ్వండి. మన రాష్ట్రానికి కేంద్రం ఏం నిధులు ఇస్తోందో, ఏమేమి కార్యక్రమాలు చేస్తోందో కూడా తెలుస్తుంది. మంత్రిగారిని చెప్పనివ్వండి.

**శ్రీ ఎన్. అమర్‌నాథ రెడ్డి**: అధ్యక్షా, ఎందుకంటే, ఈ నిమ్జ్‌కి సంబంధించిన ప్రాంతం దాదాపు ఆరు గ్రామాలలో అనగా సుమారు 15,925 ఎకరాలలో ఉన్నది. ఆ కంపెనీకి దాదాపు రూ.10,850కోట్ల పెట్టుబడి పెట్టడం జరిగింది. దీనికి సంబంధించి కేంద్రప్రభుత్వం viability gap funding క్రింద external infrastructure క్రింద గానీ, viability gap funding క్రింద ఇంటర్నల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు గాని ఆరోజున వారు ఒప్పుకున్న దాని ప్రకారం సుమారు 37 శాతం మేర నిధులు ఇవ్వాలి. మన రాష్ట్ర ప్రభుత్వం నుంచి భూమి ఇవ్వాలి. ఇప్పటికే దాదాపు 1700 ఎకరాలకు పైగా భూమిని తీసుకోవడం జరిగింది. ఇప్పటికే దానికి ఒప్పుకోవడం కూడా జరిగింది. అలా ఒప్పుకున్న తరువాత మన దేశంలో దాదాపు ఐదు రాష్ట్రాలలో ఈ ప్రాజెక్టులు ఉన్నాయి. ఎక్కడా ఈ ప్రాజెక్టులు అమలులోకి రాకుండా కేవలం రూ.3.50కోట్లు మాత్రమే బడ్జెట్‌లో పెట్టారు. ఈరోజున 14,000 ఎకరాలు సేకరించాలంటే దాదాపు రూ.2,500 కోట్లు పైగా రాష్ట్రప్రభుత్వం నుంచి ఖర్చు పెట్టవలసిన అవసరం ఉంది. కనీసం దానికి సంబంధించి కేంద్రం జీఓ చేయవలసింది. దానికి బడ్జెట్ రిలీజ్ చేయడమే కాకుండా, మాస్టర్ ప్లాన్‌కి కూడా కనీసం డబ్బులు ఇవ్వాల్సిన పరిస్థితి లేకుండా పూర్తిగా ఆ ప్రాజెక్టును నిర్వీర్యం చేసే పరిస్థితి కనిపిస్తోంది. ఈరకంగా మన రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం వైపు నుంచి అన్యాయం జరుగుతోందన్న వాస్తవాన్ని ఈ సందర్భంగా తమ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, అదేవిధంగా గౌరవ సభ్యులు చెప్పినట్లుగా మన్నవరం ప్రాజెక్టు గురించి చెప్పారు. అందులో ఎన్‌టిపిసి, బిహెచ్‌ఇఎల్ పవర్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ ఉంది. దానికి సంబంధించి ఒక ఎకరా రూ.100ల చొప్పున 753 ఎకరాలను ఇంతకు ముందే ఇచ్చి ఉన్నాము. వీటిని గతంలోనే సేకరించడం జరిగింది. ఆనాటి ప్రధాన మంత్రిగారు వచ్చి వాటికి పునాదిరాయి వేశారు. అక్కడ పరిపాలనా భవనాలు కట్టారు. అక్కడ ఫ్యాక్టరీ భవనాలు, యంత్ర సామాగ్రికి సంబంధించిన

పరికరాలు ఇతరత్రా అన్ని సదుపాయాలు, సౌకర్యాలు కూడా ఉన్నాయి. ఇప్పటివరకు రూ.130కోట్లు మాత్రమే వాటిపైన ఖర్చు పెట్టడం జరిగింది. ఆ ప్రాజెక్టును కూడా నిర్వీర్యం చేయడమే కాకుండా, వాటిని ఇక్కడ నుంచి గుజరాత్‌కు తరలిస్తారనేటటువంటి వార్తలు కూడా హాన్స్ ఇండియా అనే పత్రికలో ప్రచురితమయిన సంగతిని తమ ద్వారా గౌరవ సభ్యులకు ఒకసారి గుర్తు చేస్తున్నాను.

అధ్యక్షా, మరొక బాధాకరమైన సంఘటన ఏమిటంటే, మనకు విభజన చట్టంలోనే హెచ్‌పిసిఎల్, గెయిల్‌కి సంబంధించి ఈ పెట్రో కెమికల్ ప్రాజెక్ట్‌కు సంబంధించి మన రాష్ట్రానికి రీ-ఆర్గనైజేషన్ యాక్ట్ క్రింద కేంద్రం మనకు ప్రామిస్ చేసిందో దానికి సంబంధించి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వయబులిటీ గ్యాప్ ఫండింగ్ క్రింద దాదాపు రూ.7,500కోట్లను అడుగుతోంది. అదేవిధంగా గుజరాత్ రాష్ట్రంలో ONGC PETRO CHEMICAL ADDITIONS LIMITED క్రింద సేమ్ ప్రాజెక్ట్‌ను అక్కడ ఇనాగరేట్ చేశారు. వారికి ఒక్క రూపాయి కూడా వయబులిటీ గ్యాప్ ఫండింగ్ అడగకుండానే చేసేశారు. ఇదేం డబుల్ స్టాండర్డ్స్ అధ్యక్షా? ఈ రకంగా మన రాష్ట్రం మీద కేంద్రం ఈ రకమైన దృష్టితో ఎందుకు ఉందో అర్థం కావడం లేదు. మన రాష్ట్రంలో హెచ్‌పిసిఎల్, గెయిల్‌కి సంబంధించిన ప్రాజెక్ట్ రాలేదో, అక్కడే కాకినాడలో హల్దియా పెట్రో కెమికల్స్ కంపెనీని రూ.65వేల కోట్లతో crude to chemical complexకు మొన్ననే శంకుస్థాపన చేయడం జరిగింది.

అధ్యక్షా, మరొక ప్రక్కన విభజన చట్టంలో స్టీల్ ప్లాంట్‌కు సంబంధించి ఏదైతే చెప్పారో అది కూడా వారు చెప్పినటువంటి మాట ప్రకారం ఇవ్వకపోతే దానిని కూడా ముఖ్యమంత్రిగారి చేతుల మీదగానే శంకుస్థాపన చేయడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం నుంచి మన రాష్ట్రానికి రావలసిన పరిశ్రమలలో ఒక్క పరిశ్రమ కూడా మన రాష్ట్రానికి రాకుండా అన్యాయం చేస్తున్నారు. మరి వీటికి సంబంధించి కేంద్రప్రభుత్వ ప్రతినిధులుగా మాట్లాడేటటువంటి వాళ్ళు కూడా ఏం మాట్లాడడం లేదు. మొన్న ప్రకాశం జిల్లాకు ఎం.పి.గారు వచ్చి మాట్లాడుతున్నారు. దానికి పూర్తిగా మన రాష్ట్రప్రభుత్వం ఏదో సరైన సమాచారం పంపించలేదని, వాటికి సంబంధించిన ప్రాజెక్టు రిపోర్టులను పంపించలేదని అన్నారు. అసలు ప్రాజెక్టు రిపోర్టు సమాచారాన్ని పంపించకుండానే వాళ్ళు ఎలా ప్రాజెక్టును శాంక్షన్ చేస్తారు? అసలు ప్రాజెక్టును శాంక్షన్ చేసే అవకాశం ఎలా ఉందో కనీసం దానిని కూడా తెలుసుకోకుండా పత్రికలలో ఆ విధంగా మాట్లాడడం నిజంగా అన్యాయం. ఈ విధంగా మన రాష్ట్రానికి సంబంధించిన పరిశ్రమలను రానివ్వకుండా కేంద్ర ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోంది.

అధ్యక్షా, మరొక ప్రక్కన అనంతపురం జిల్లాలో కియా కార్ల పరిశ్రమను తీసుకువచ్చాము. ఒకప్రక్కన కియా ఇండస్ట్రీ చెప్పినటువంటి మాట ప్రకారం అంతకన్నా ముందరే ఆ పరిశ్రమను ప్రొడక్షన్ స్థాయికి తీసుకువస్తే, అక్కడ నిన్న కూర్చుని కొంతమంది ధర్నా చేస్తున్నారు. అక్కడ లోకల్ ఎంప్లాయ్‌మెంట్ కావాలని, మేము వాటిని భర్తీ చేయడం లేదని ధర్నా చేస్తున్నారు. గతంలో వారు అధికారంలో ఉన్నప్పుడు మన రాష్ట్రానికి రావాల్సిన వోక్స్ వాగన్ కంపెనీ వస్తే, దానిని ఇక్కడ నుంచి బయటకు తరిమేశారు. ఈరోజున మన ముఖ్యమంత్రిగారి ఫేస్ వాల్యూ చూసి కియా కార్ల కంపెనీ మన రాష్ట్రానికి వస్తే, అక్కడ ఉద్యోగావకాశాలు రావడం లేదని, ఏదోరకంగా ఆ కంపెనీ యాజమాన్యాన్ని

బెదిరించి, వారిని భయభ్రాంతులను చేయాలనే విధంగా కొంతమంది ప్రయత్నం చేస్తున్నారు. మరొక ప్రక్కన కేంద్రప్రభుత్వం రావలసిన వాటినన్నింటిని మనకు రానివ్వకుండా అన్యాయం చేసేటటువంటి పరిస్థితి ఉన్నది. ఈ రకంగా కేంద్రం మన రాష్ట్రాన్ని అన్ని రకాలుగా అన్యాయం చేస్తోంది. ఈ రాష్ట్రప్రభుత్వాన్ని ఒక ప్రక్కన భారతీయ జనతాపార్టీ, మరొక ప్రక్కన సహకరించేటటువంటి ప్రధాన ప్రతిపక్షం దారుణంగా అన్యాయం చేస్తున్నారు. వీరంతా కలిసి మన రాష్ట్రానికి తీరని అన్యాయం చేయాలనే ఉద్దేశంతో మనకు తీరని ద్రోహం చేస్తున్నారు. నేను వాస్తవాలను చెపుతున్నాను. నేనేమీ తప్పుగా మాట్లాడడం లేదు. ఇద్దరూ కలిసి ఈ రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారు. మన రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమలను ఏదోరకంగా రానివ్వకుండా చేయాలి, మరొక ప్రక్కన మనకు రావలసిన నిధులను రానివ్వకుండా కేంద్రప్రభుత్వం చేస్తోంది. ఈ రెండూ కలిసి ఈ రాష్ట్రానికి, మనకు కావలసిన పరిశ్రమలు రాకుండా, తీరని ద్రోహం చేస్తున్నారు. అధ్యక్షా, ఈ రాష్ట్ర మంత్రిగా నా బాధ్యతగా నేను చెప్పవలసింది చెపుతున్నాను.

**శ్రీ సోము వీర్రాజు (శాసనసభా నియోజకవర్గం) (మైకులేదు)**: అధ్యక్షా, గౌరవ మంత్రిగారిని కావాలంటే బయటకు వెళ్ళి ప్రెస్‌మీట్ పెట్టుకుని చెప్పమనండి. ఇది క్వశ్చన్ అవరా, లేక డిబేటా? ఎప్పుడు చూసినా కేంద్రాన్ని మాటలు అనడమేనా? ప్రశ్నకు సంబంధించి మాత్రమే గౌరవ మంత్రిగారు సమాధానం ఇవ్వాలి కానీ, ఇలా కేంద్ర, రాష్ట్రాలకు వ్యతిరేకంగా ఎలా మాట్లాడతారు? అయితే కేంద్రానికి సంబంధించి తీవ్రంగా, వ్యతిరేకంగా మాట్లాడడం తప్ప వేరే పని లేదా? మీరు కావాలంటే ఈ సంగతులన్నీ బయట ప్రెస్ మీట్ పెట్టి అక్కడ చెప్పండి.

(అంతరాయం)

ఉ.10.30

**MR.DEPUTY CHAIRMAN:** (సభ్యులు శ్రీ కరణం బలరామకృష్ణమూర్తి గార్ని ఉద్దేశించి)Next Question No.10856. మీ ప్రశ్నే (ప్రశ్న నెం.10893-ప్రకాశం జిల్లా కనిగిరిలో నిమ్జ్) మీరు రాలేదు మరి.

**శ్రీ సోము వీర్రాజు:** (మంత్రివర్యులు శ్రీ ఎస్.అమర్‌నాథ్ రెడ్డి గార్ని ఉద్దేశించి) మాట్లాడేటప్పుడు పద్ధతిగా మాట్లాడాలి. అంతేతప్ప, మీ గోలేంటి, మీ గోలేంటి అని అడుగుతారా? ఇది గోలా?

**మిస్టర్ డిప్యూటీ ఛైర్మన్:** క్వశ్చన్ మీదే. మీరు లేరు, మినిస్టర్ గారు ఆన్సర్ చెప్పేశారు. (సభ్యులు శ్రీ కరణం బలరామకృష్ణమూర్తి గార్ని ఉద్దేశించి).

**శ్రీ సోము వీర్రాజు:** అడిగిన దానికి సమాధానం చెప్పండి. గోల అంటే ఏమిటి? (మంత్రివర్యులు శ్రీ ఎస్.అమర్‌నాథ్ రెడ్డి గార్ని ఉద్దేశించి)(మైకు లేదు)

**శ్రీ బి.ఎస్.రాజసింహులు (స్థానిక సంస్థలు – చిత్తూరు):** సభలో అడిగితే తప్పా? (సభ్యులు శ్రీ సోము వీర్రాజు గార్ని ఉద్దేశించి)

**మిస్టర్ డిప్యూటీ ఛైర్మన్:** ఏమండీ. మీకు చాలాసార్లు చెప్పాను. దొరబాబు గారూ, వీర్రాజు గారూ what is this?

(అప్పటికే తమ స్థానాల వద్ద నిలబడి ఉన్న సభ్యులు శ్రీ సోము వీర్రాజు మరియు శ్రీ బి.ఎస్.రాజసింహులు గార్ల మధ్య పరస్పరం వాగ్వాదం చోటు చేసుకుంది.)

మీకు చాలాసార్లు చెప్పాను. మీరిద్దరూ మాట్లాడుకోవడమేంటి? What is this? ఎన్నిసార్లు చెప్పినా మీరిద్దరూ మాట్లాడుకుంటుంటే ఇక్కడ చైర్ ఎందుకు? ఇక్కడ మేమెందుకు? మీరూ, మీరూ మాట్లాడుకోండి. ఎన్నిసార్లు చెప్పినా సభా సంప్రదాయాల్ని మాత్రం పాటించరు. మీరు డైరెక్టుగా ఆయనతో మాట్లాడతారు, ఆయన మీతో మాట్లాడతారు. మీ ఇద్దరి సంభాషణలు మేం వినాలా ఇక్కడ?

**శ్రీ బుద్ధా వెంకటేశ్వరరావు(మైకు లేదు):** అధ్యక్షా, ఛైర్‌ని చూసి మాట్లాడని సభ్యులను సస్పెండ్ చేయండి సార్.

**మిస్టర్ డిప్యూటీ ఛైర్మన్:** సభా సంప్రదాయాలు పాటించాలి. మీకు అవకాశం కావాలంటే నన్ను అడగండి. నేను టైమిస్తాను. నన్ను అడిగితే టైమిస్తాను కదా క్వశ్చన్ అవర్ ఉంది. మీరు టైం కేటాయిస్తే, టైమున్నంత వరకు సభ్యులందరికీ అవకాశమిస్తాను. క్వశ్చన్ అవర్ తరువాత మళ్లా బడ్జెట్ ప్రవేశపెట్టాల్సి ఉంది. టైం అడ్జస్ట్ చేసుకుని పది ప్రశ్నలు టేకప్ చేయాలి. క్వశ్చన్ అవర్స్ చేయకండి. షార్ట్ డిస్కషన్‌లు పెట్టడాలెందుకు? (సభ్యులు శ్రీ కరణం బలరామ కృష్ణమూర్తి గార్ని ఉద్దేశించి) మీ ప్రశ్న వచ్చేటప్పటికి మీరు సభలో లేరు. మంత్రి గారు ఆన్సర్ చెప్పేశారు, మరలా మీరొచ్చారు.

**శ్రీ కరణం బలరామకృష్ణమూర్తి (శాసనసభా నియోజకవర్గం):** నేను క్లారిఫికేషన్ మాత్రమే అడుగుతాను అధ్యక్షా.

**మిస్టర్ డిప్యూటీ ఛైర్మన్:** ఓకె. మీదే క్వశ్చన్ కాబట్టి, మీకు అవకాశమిచ్చాను. చెప్పండి.

**శ్రీ కరణం బలరామకృష్ణమూర్తి:** అధ్యక్షా, మొత్తం ల్యాండ్ వచ్చేటప్పటికి 12,033 ఎకరాలు కావాలని వీళ్లు ప్రపోజల్ పెట్టడం జరిగింది. ఇందులో గవర్నమెంట్ ల్యాండ్ వచ్చేటప్పటికి 5,667 ఎకరాలు దాదాపుగా ఉన్నది. ఉన్నదాంట్లో కనీసం ఈ నిమ్జ్ ద్వారా అక్కడ ఏదైనా ఆఫీసన్నా పెట్టేసి ప్రయత్నాలు ఏమి జరుగుతున్నాయనేదాని మీద కొద్దిగా వివరణ ఇస్తే బాగుంటుంది. సెంట్రల్ గవర్నమెంట్ విషయానికివస్తే వాళ్లు చేసే అన్యాయాలు, అక్రమాలు మనం చూస్తూనే ఉన్నాము. మంత్రి గారు కూడా దానికి సమాధానం చెప్పారు గాని, దీనిపై కూడా క్లారిటీ ఇస్తే బాగుంటుంది.

**మిస్టర్ డిప్యూటీ ఛైర్మన్:** మినిస్టర్ గారూ, వన్ మినిట్ అండి. లేకపోతే ఇది షార్ట్ డిస్కషన్ అయిపోతుంది. ఇప్పటికే ఈ ప్రశ్నకు 15 నిమిషాలయ్యింది.

**శ్రీ ఎన్.అమర్‌నాథ్ రెడ్డిః** అధ్యక్షా, తట్టుకోలేక నా బాధను చెప్పానంతే.

**మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్ః** కంప్లీట్ చేయండి.

**శ్రీ ఎన్.అమర్‌నాథ్ రెడ్డి:** అధ్యక్షా, సభ్యులు చెప్పిన విషయాన్ని కూడా గమనిస్తున్నాము. కొంత ల్యాండ్ ప్రొక్యూర్ చేశాము కాబట్టి ఏ రకంగా పరిశ్రమల్ని అక్కడ అభివృద్ధి చేయాలనేది ఆలోచిస్తున్నాము. ఖచ్చితంగా అక్కడ ఏదో రకమైన పరిశ్రమలను తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నాము. ఎందుకంటే, కేంద్ర ప్రభుత్వం ఇస్తాము అని చెప్పి, ఇవ్వనటువంటి వాటన్నింటినీ తీసుకొచ్చాము. ఒకవైపు గెయిల్, పెట్రోకెమికల్ కారిడార్, స్టీల్‌ప్లాంట్ కావాలంటే తెచ్చాము. మన్నవరం ప్రాజెక్టు గురించి కేంద్రంలో ప్రభుత్వం మారిన తరువాత ఏం చేయాలనేది కూడా ఆలోచిస్తున్నాము. రేపు వచ్చే ప్రభుత్వంలో దీన్ని టేకప్ చేద్దామనే ఆలోచన ఉంది. అదేరకంగా, సభ్యులు కోరిన విధంగా అది బ్యాక్‌వర్డ్ డిస్ట్రిక్ట్ కాబట్టి ఖచ్చితంగా చేస్తాము.

## <u>గిరిజన విశ్వవిద్యాలయం</u>

ప్రశ్న నెం.10856(4)

శ్రీ మతి గుమ్మిడి సంధ్యారాణి, ఎం.ఎల్.సి.

గౌరవనీయులైన మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) రాష్ట్రంలో గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయడంలో అసాధారణ జాప్యం జరుగుతున్న విషయం వాస్తవమేనా;

ఆ) అయితే, ఎప్పటిలోగా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయడమవుతుంది?

**గౌరవనీయులైన మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి (శ్రీ గంటా శ్రీనివాసరావు):**

అ) అవునండీ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయనగరం జిల్లాలో కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటులో జాప్యం జరుగుతుంది.

ఆ) (i) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయనగరం జిల్లాలో కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయడం కోసం కేంద్ర విశ్వవిద్యాలయాల (సవరణ) బిల్లు – 2018 ను పార్లమెంటులో ఇటీవల ప్రవేశపెట్టడమయిందని కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల అభివృద్ధి (ఎంహెచ్.ఆర్.డి) మంత్రిత్వ శాఖ ఇటీవల తెలియజేసింది.

(ii) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 01-12-2015 తేదీగల రెవెన్యూ (అసైన్- I) శాఖ జి.ఓ.ఆర్.టి. నెం.1231 ద్వారా విజయనగరం జిల్లా రెల్లిలో 526 ఎకరాల 24 సెంట్ల విస్తీర్ణం గల భూమిని ముందస్తుగా స్వాధీనం చేసింది.

(iii) ప్రతిపాదిత కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయాన్ని నిర్వహణలోకి తేవడానికి విశాఖపట్టణంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని మెంటార్ విశ్వవిద్యాలయంగా 04-01-2019 తేదీగల లేఖ ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది.

(iv) కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ సలహా ప్రకారం విజయనగరం జిల్లాలోని, ప్రతిపాదిత కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయానికి మెంటారుగా ఆంధ్రా విశ్వవిద్యాలయం వైస్-ఛాన్స్‌లర్, ప్రొఫెసర్ నాగేశ్వరరావును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 04-01-2019 తేదీగల లేఖ ద్వారా నామినేట్ చేసింది.

**శ్రీమతి గుమ్మిడి సంధ్యారాణి (శాసనసభా నియోజకవర్గం):**అధ్యక్షా, గిరిజన విశ్వవిద్యాలయమనేది గత ఐదేళ్లుగా దాదాపుగా ఒక కలగానే మిగిలిపోతోంది. విభజన హామీల్లో ఒక హామీగా కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చిన హామీ అది. ఐదు సంవత్సరాలుగా కనీసం గిరిజన విశ్వవిద్యాలయం కట్టాలనే తపన గాని, ఆలోచన గాని ఇంతవరకు కేంద్ర ప్రభుత్వానికి లేకపోవడం చాలా బాధగా ఉంది. ముఖ్యంగా నిరుపేద గిరిజనుల్ని ఇంత చులకన భావంతో చూడటంపట్ల మేము చాలా బాధపడుతున్నాము. ఇక్కడ 527 ఎకరాల్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి, ఎవరైతే గిరిజనులున్నారో, వారందరికీ కూడా ఇళ్లస్థలాలు గాని, ఇళ్లు గాని, డబ్బులు గాని రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం జరిగింది. కానీ, కేంద్ర ప్రభుత్వం మాత్రం కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.5 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకున్న సంగతి గిరిజనులుగా మాకెంతో బాధకలిగిస్తోంది. దయచేసి, మంత్రివర్యుల ద్వారా తమకు విజ్ఞప్తి చేసేదేమంటే, కనీసం రాష్ట్ర ప్రభుత్వమైనా దీని మీద దృష్టి పెట్టి గిరిజనుల కోసం గిరిజన విశ్వవిద్యాలయాన్ని త్వరగా ఏర్పాటు చేసేందుకు ఒక పరిష్కారమార్గాన్ని ఆలోచించి చేయాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను. ఎందుకంటే, రాష్ట్రంలో దాదాపుగా 7 గిరిజన నియోజకవర్గాలున్నాయి. ఆ 7 నియోజకవర్గాలే కాకుండా కొన్ని గిరిజన మండలాలు కూడా ఉన్నాయి. పూర్తిస్థాయిలో 32 గిరిజన మండలాలు రాష్ట్రంలో ఉన్నాయి. అట్లాంటి రాష్ట్రంలో గిరిజనుల కోసం కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేయకపోవడం చాలా దుర్మార్గం. దయచేసి, తమ ద్వారా నేను మంత్రివర్యులకు గిరిజన విశ్వవిద్యాలయాన్ని అతి త్వరలో ప్రారంభించమని కోరుతున్నాను.

**శ్రీ రాము సూర్యారావు (ఉపాధ్యాయ నియోజకవర్గం - తూర్పు, పశ్చిమ గోదావరి)** అధ్యక్షా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కూడా గిరిజన ప్రాంతాలు ఎక్కువగా ఉన్నాయి. విశ్వవిద్యాలయం ఎప్పుడు వస్తుందా అని వారంతా ఎదురుచూస్తున్నారు. దయచేసి, ఒకరినొకరు విమర్శించుకోకుండా, ఒకరికొకరు ఘర్షణ వైఖరి అవలంబించకుండా, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఈ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి సత్వర చర్యలు తీసుకోవాల్సిందిగా మీ ద్వారా రెండు ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తున్నాను.

**శ్రీ సోము వీర్రాజు:** అధ్యక్షా, ఈ ప్రశ్నను లేవనెత్తిన వారే విశ్వవిద్యాలయానికి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.5 కోట్లు కేటాయించడం జరిగిందని చెప్పడం జరిగింది. కాంపౌండ్ వాల్ రాష్ట్ర ప్రభుత్వం నిర్మించి ఇచ్చిన

తరువాత, కేంద్రం దీనికి సంబంధించినటువంటి నిధుల్ని విడుదల చేస్తుంది. అన్ని ప్రాంతాల్లోనూ యూనివర్సిటీలను ఆవిధంగా ఏర్పాటు చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. విభజన బిల్లులో ఉన్నవిధంగా, పది సంవత్సరాల్లో ఏర్పాటు చేయాల్సిన యూనివర్సిటీలను ఏర్పాటు చేయడం, ఎయిమ్స్‌లో క్లాసులు ప్రారంభించడంతోబాటు, అన్నిచోట్లా యూనివర్సిటీల పురోగతిని గమనిస్తే గుంటూరులో అగ్రికల్చర్ యూనివర్సిటీ గాని, ఎయిమ్స్ గాని, నిట్ గాని, తిరుపతి, విశాఖపట్నంలో గాని ఏవిధంగా జరుగుతోందనేది మంత్రివర్యులు ఒక కమిటీ వేసి సభ్యుల్ని తీసుకువెళ్లి ఏ, యే యూనివర్శిటీల్లో ఏం జరుగుతోంది, కేంద్ర ప్రభుత్వం వారు ఎంత కేటాయించారు, కేటాయించిన నిధులతో ఆ కాంపౌండ్ వాల్‌ని ఎప్పుడు కట్టించి ఇస్తున్నాము, ఇప్పటివరకు అయిన పనుల పురోగతిపైన ఒక అధ్యయన కమిటీని వేస్తే, సభ్యులు దఫదఫాలుగా ఈవిధంగా ఆవేదన వ్యక్తం చేయడానికి అవకాశం తగ్గుతుందని నేను అభిప్రాయపడుతున్నాను. ఎందుకు చెబుతున్నానంటే, మూడుసార్లకు పైగా మేము ఎయిమ్స్‌కు వెళ్లి చూస్తే అక్కడ భవనాలు కట్టేస్తున్నారు. ఎయిమ్స్‌కి ఏమీ సపోర్టు లేదన్నారు. రిపోర్టర్లు కూడా చూసి ఆశ్చర్యపోయారు. అగ్రికల్చర్ యూనివర్సిటీ చూశాము. చాలావరకు పనులు ముందుకు వెళ్లిపోయాయని యూనివర్సిటీలో అధికారులే చెబుతున్నారు. ప్రతి యూనివర్సిటీలో పనులు జరుగుతున్నాయి. నేను ఇక్కడ ఎవర్నీ విమర్శించడం లేదు.

**మిస్టర్ డిప్యూటీ ఛైర్మన్:** (సభ్యులు శ్రీ సోము వీర్రాజు గారిని ఉద్దేశించి) మీరు కంప్లీట్ చేయండి. ఇది షార్ట్ డిస్కషన్ కాదు. మీకు ఏదైనా క్లారిఫికేషన్ కావాలంటే మినిష్టరు గారు ఇస్తారు. మీరు స్ట్రెయిట్‌గా అడగండి.

**శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం:** అధ్యక్షా, ఈ గిరిజన విశ్వవిద్యాలయం మీద ఏదేదో విషయాలు మాట్లాడితే ఎలా ? ఈ గిరిజన విశ్వవిద్యాలయం ప్రారంభించాలంటే పార్లమెంటులో చట్టసవరణ చేయాలి. ఇది అసలు విషయం. చట్టసవరణ చేయడానికి నాలుగున్నరేళ్లు అయినా కూడా తీరలేదు. ఇప్పుడు కూడా మంత్రి గారిచ్చిన సమాధానంలో ఏముందంటే పార్లమెంటులో బిల్లు పెట్టారని ఉంది తప్ప, బిల్లు పాస్ చేశారని లేదు. బిల్లు ఇంకెప్పుడు పాస్ చేస్తారు ? అయిపోయింది. నాలుగైదు రోజులు పూర్తయితే పుణ్యకాలం కాస్తా పూర్తయిపోతుంది. ఇంక బిల్లు పాస్ చేసేందుకు అవకాశం ఎక్కడుంది ? కాంపౌండ్ వాల్ కడితే చట్ట సవరణ చేస్తారా ? ఏంటండీ ఇది ? గోకులాష్టమికి, పీర్లపండగకి ఏం సంబంధం ఇక్కడ? నాకేమీ అర్థం కావడం లేదు. దయచేసి, గిరిజనులు కాబట్టే ఇలా జరుగుతోందని రాష్ట్ర ప్రజలు, రాష్ట్రప్రభుత్వాన్ని అనుకునే దానికి కూడా అవకాశముంది కాబట్టి, ఊరకే అటూ, ఇటూ చేయడం కాకుండా, ఈ పార్లమెంటు సమావేశాల్లోనే ఈ చట్టసవరణ జరిగితేనే ఈ గిరిజన విశ్వవిద్యాలయం వస్తుంది, లేకపోతే రాదు. లేదంటే కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత మాట్లాడుకోవాల్సిన విషయంగా ఇది మారుతుంది.

ఉ.10.40

**డా. గాదె శ్రీనివాసులు నాయుడు (ఉపాధ్యాయ నియోజకవర్గం – శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం) :** అధ్యక్షా, ఇప్పటికే గిరిజన విద్యార్థులు నాలుగు సంవత్సరాలు నష్టపోయారు. దయచేసి ఇప్పటికైనా సరే వేగవంతంగా ఆ తరగతులు ప్రారంభమయ్యేట్లుగా భవన నిర్మాణం చేపట్టాలని కోరుతున్నాను. అంతవరకూ

వేరే ప్రైవేటు భవనాలలోనైనా తరగతులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. టీచర్ ఎడ్యుకేషన్ యూనివర్సిటీకి సంబంధించి రిపోర్టు కూడా వచ్చింది. టీచర్ ఎడ్యుకేషన్ యూనివర్సిటీని కూడా ప్రారంభిస్తే డి.ఎడ్, బి.ఎడ్ కాలేజీల క్వాలిటీ పెరగడంతోబాటు ఉద్యోగం చేస్తున్న ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చేందుకు కూడా అది బాగా ఉపయోగపడుతుంది. తద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ఉపయోగపడుతుంది కాబట్టి మంత్రిగారు చొరవ తీసుకుని ఇప్పటికే రిపోర్టు తెప్పించారు, అది ప్రారంభమయ్యేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

**శ్రీమతి గుమ్మిడి సంధ్యారాణి:** అధ్యక్షా, గౌరవ సభ్యులు వీర్రాజు గారు మోకాలికి బోడిగుండుకి ముడిపెడుతున్నారు.

**మిస్టర్ డెప్యూటీ చైర్మన్:** మీరు ఏదైనా సప్లిమెంటరీ ఉంటే అడగండి.

**శ్రీమతి గుమ్మిడి సంధ్యారాణి:** అధ్యక్షా, అంటే మధ్యలో ఆయన మాట్లాడారు కాబట్టి చెబుతున్నాను అధ్యక్షా. This land belongs to someone అని పెట్టుకోవడానికి కాంపౌండ్ వాల్ కట్టుకోవాలా అధ్యక్షా? మింగడానికి మెతుకు లేదు గానీ, మీసాలకు సంపెంగ నూనె అంటారు మా ప్రాంతంలో. ఇంకా బిల్డింగే కట్టలేదు, తరగతులు ప్రారంభం కాలేదు. కాంపౌండ్ వాల్ కట్టలేదు కాబట్టే బిల్డింగ్ ఇవ్వలేదు అనడం ఎంత దారుణమో ఆలోచించండి.

**శ్రీ సోము వీర్రాజు :** (మైక్ లేదు) యాక్టులో అలాగే ఉన్నది. దాని ప్రకారమే జరుగుతోంది.

**శ్రీమతి గుమ్మిడి సంధ్యారాణి:** అధ్యక్షా, వీర్రాజు గారు సీనియర్ సభ్యులు. వారు మాట్లాడితే మధ్యలో నేను మాట్లాడలేను. పార్లమెంట్‌లో బిల్లు పాస్ అవలేదు. ఇంకా యూనివర్సిటీ పనులు మొదలు పెట్టలేదు. గిరిజనులనే చిన్న చూపు క్లియర్‌గా కనిపిస్తున్నది. ఎందుకంటే మిగతా విశ్వవిద్యాలయాలన్నీ అద్దె భవనంలోనో, రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన భవనాలలోనో ఎక్కడో ఒకచోట 'మమ' అనిపిస్తున్నారు. కానీ, కేవలం గిరిజన విశ్వవిద్యాలయాన్ని మాత్రం ఇంతవరకూ కట్టలేదు సరికదా, కాంపౌండ్ వాల్‌కు ఆ మాత్రం డబ్బులు ఏ మూలకు సరిపోవు. కొద్దిగా ఇచ్చి వదిలించుకున్నారు అంతే. పైగా అడిగితే కాంపౌండ్ వాల్ కడితే మిగతా డబ్బులు ఇస్తామనడం ఎంత దారుణమైన విషయమో ఒకసారి ఆలోచించండి అధ్యక్షా. దయచేసి దీనిపైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

**శ్రీ గంటా శ్రీనివాసరావు:** అధ్యక్షా, పెద్దలు, గౌరవ సభ్యులు గిరిజన విశ్వవిద్యాలయం గురించి మాట్లాడడం జరిగింది. రీ-ఆర్గనైజేషన్ యాక్టు ప్రకారం కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రానికి 7 విద్యా సంస్థలను చట్టంలో పెట్టడం జరిగింది. 1) IIM 2) NIT 3) IIT 4) IISER 5) Central University 6) IIIT 7) Tribal University. 7 సంస్థలకు సంబంధించి సెంట్రల్ యూనివర్సిటీ, ట్రైబల్ యూనివర్సిటీ తప్ప మిగతా 5 యూనివర్సిటీలను ప్రభుత్వం వచ్చిన మొదటి సంవత్సరంలోనే అప్పటి కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ గారు, పెద్దలు వెంకయ్యనాయుడు గారి సమక్షంలో గౌరవ ముఖ్యమంత్రిగారు హాజరై శంకుస్థాపన చేయడం జరిగింది. తాత్కాలిక క్యాంపస్‌లలో తరగతులు మొదలయ్యాయి. అయితే, కేంద్రీయ విశ్వవిద్యాలయం, గిరిజన విశ్వవిద్యాలయాల అంశం పార్లమెంట్‌లో గానీ, కేంద్ర కేబినెట్‌లో గానీ

abnormal గా delay కావడం జరిగింది. చివరగా గిరిజన విశ్వవిద్యాలయం మిగిలిపోతే దానిని మొన్న కేబినెట్‌లో అప్రూవ్ చేసి పార్లమెంట్‌లో బిల్లు పెట్టారు. పెద్దలు విటపు బాలసుబ్రహ్మణ్యం గారు చెప్పినట్లు పార్లమెంట్‌లో బిల్ పాస్ కావలసి ఉన్నది.

అందుకొరకు 2015, డిసెంబరు 1వ తేదీ నాడు 526 ఎకరాల భూమిని కేటాయించారు. ఆ తరువాత నాలుగు సంవత్సరాలకు ఇప్పటికి దానికి మోక్షం లభించింది. Mentor University గా ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ప్రాసెస్ మొదలయింది. పెద్దలు వీర్రాజు గారు బిజెపి సభ్యులు ఇక్కడ ఉన్నారు. వారి సహకారం కూడా కోరుతున్నాము. రాజకీయాలంటే వేరు వేరుగా చూస్తాము గానీ, రాష్ట్రప్రయోజనాలు, ప్రత్యేకించి విద్యాసంస్థల విషయంలో మనందరం కలిసి అవసరమైతే కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి పార్లమెంట్‌లో బిల్లు పాస్ చేసుకోవాల్సిన అవసరం ఉన్నది. మెంటార్ యూనివర్సిటీకి ఇంతవరకూ గైడ్‌లైన్స్ కూడా ఇవ్వలేదు. మొట్టమొదటిసారిగా కేంద్రీయ విశ్వవిద్యాలయానికి రాష్ట్ర విశ్వవిద్యాలయాన్ని మెంటార్‌గా పెట్టడం జరిగింది. ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌ని మెంటార్‌గా పెట్టారు. ఆయనకున్న అధికారాలేమిటి, ఆయన ఏం చేయాలనేదానిపై కూడా ఇంకా డైరెక్షన్స్ స్పష్టంగా రాలేదు. సెంట్రల్ హెచ్ఆర్‌డితో మాట్లాడి క్లియర్‌గా గైడ్‌లైన్స్ తీసుకొని ఏఏ కోర్సులు మొదలు పెడతారు, ఇన్‌టేక్ ఎంత, ఇటువంటి ప్రొసీజర్స్ ఫైనలైజ్ చేసుకోవాలనే విషయంపై నేను మా సెక్రటరీలకు కూడా చెప్పడం జరిగింది. గిరిజనులకు సంబంధించిన ఇనిస్టిట్యూట్ ఇది. చాలా ప్రతిష్టాత్మకమైన సంస్థ. త్వరగా తరగతులు మొదలయ్యేలా అన్ని చర్యలు తీసుకోవాలని, అందుకు అందరూ సహకరించాలని కోరుతున్నాను.

## విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయుట

ప్రశ్న నెం. 10818 (5)
డా. ఎ.ఎస్. రామకృష్ణ, ఎంఎల్‌సి

గౌరవనీయులైన మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి దయచేసి ఈ క్రింది సమాచారం తెలియచేస్తారా;

అ) శాశ్వత ప్రాతిపదికపై ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో లెక్చరర్లను నియమించేందుకు ప్రభుత్వం ఏవైనా చర్యలు తీసుకుంటున్నదా ;

ఆ) అయితే, ఆ ప్రక్రియను ఎప్పటిలోగా పూర్తి చేయడమవుతుంది?

**గౌరవనీయులైన మానవ వనరుల అభివృద్ధి, (ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత, సాంకేతిక విద్య) శాఖ మంత్రి (గంటా శ్రీనివాస రావు ) :**

అ) అవునండీ.

ఆ) పెండింగులో ఉన్న కోర్టు కేసుల తీర్పుకు లోబడి ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయడమవుతుంది.

**డా. ఎ.ఎస్. రామకృష్ణ (ఉపాధ్యాయ నియోజకవర్గం – కృష్ణా, గుంటూరు):** అధ్యక్షా, మన రాష్ట్రంలో ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో దాదాపు 1380 అధ్యాపక పోస్టులు ఉన్నాయి. వాటిల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 1108, మిగతావి అసోసియేట్ ప్రొఫెసర్లు మొదలైన పోస్టులు ఉన్నాయి. ప్రొఫెసర్ల కోసం స్క్రీనింగ్ టెస్ట్ జరిపి చాలా రోజులైంది. 2018న స్క్రీనింగ్ టెస్ట్ జరిపారు. దాదాపు 26 వేలమంది దానికి హాజరయ్యారు. సుమారు 3,000 మందికి పైగా ఇంటర్వ్యూలకు కూడా హాజరయ్యారు. నాలుగు విశ్వవిద్యాలయాలు ఇంటర్వ్యూలు జరపడానికి షెడ్యూలు కూడా ప్రకటించడం జరిగింది. కోర్టు తీర్పుననుసరించి ఇంటర్వ్యూ ప్రక్రియను ఆపు చేయడం జరిగిందని మంత్రిగారు సమాధానంలో చెప్పారు. అయితే, నాకు తెలిసి ఇంటర్వ్యూలు జరపమని, రిజల్ట్స్ మాత్రం ప్రకటించవద్దని కోర్టు చెప్పింది. మన ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో బ్రహ్మాండమైన మౌలిక సదుపాయాలున్నాయి. వాటిని ఉపయోగించుకోవాలంటే శాశ్వత ప్రాతిపదికగా ఉపాధ్యాయులంటే తప్ప అక్కడ సరైన బోధన, పరిశోధనలలో నాణ్యత పెరగదు. దీనిపై దృష్టిపెట్టి వెంటనే శాశ్వత ప్రాతిపదికపై చర్యలు చేపట్టాలి. ఎందుకంటే, క్వాలిఫై అయినవారందరూ పిహెచ్.డి., నెట్, స్లెట్ పూర్తి చేశారు. కొంతమంది చాలా ఆర్టికల్స్, పుస్తకాలు రాశారు. ఇన్ని క్వాలిఫికేషన్లు ఉన్న అధ్యాపకులు ఉన్నారు కాబట్టి వారిని ఎంత త్వరగా నియమిస్తే అంత మంచిది. ఎందుకంటే విశ్వవిద్యాలయాలలో బోధనే కాకుండా, పరిశోధన కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరగడానికి అవకాశముంది. అక్కడ బోధన, పరిశోధన సరిగా జరగడం లేదని ఇప్పటికే యూనివర్సిటీలపై ఒక విమర్శ ఉన్నది. సుమారు 1800 కాంట్రాక్టు లెక్చరర్లు పనిచేస్తున్నారు. వాళ్లు కోర్టుకు వెళ్లారు. అందువల్ల ఈ ఇబ్బంది వస్తున్నదని చెప్పడం జరిగింది. అయితే, కోర్టు తీర్పులో కూడా ఇంటర్వ్యూలు జరపవద్దని చెప్పలేదు. ఇంటర్వ్యూ జరపవచ్చు. అయితే, దానిని సీల్డు కవర్‌లో పెట్టవచ్చు. ఆ పనైనా చేస్తే వాళ్లు తృప్తి పడతారు. మీ ద్వారా మంత్రిగారిని ఆ పని చేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను.

**శ్రీమతి పామిడి శమంతకమణి :** అధ్యక్షా, మా అనంతపురంలో ఎస్. కె. యూనివర్సిటీ ఉంది. అందులో మూడు సంవత్సరాల క్రితం రూల్ ఆఫ్ రిజర్వేషన్ కింద అటెండర్ నుండి అసిస్టెంట్ ప్రొఫెసర్ వరకూ సుమారు 60 ఎస్సీ పోస్టులు గుర్తించడం జరిగింది. కానీ, కొంతమంది 60 పోస్టులు దళితులకు పోతాయనే దుగ్ధతో కోర్టుకు వెళ్లి స్టే తీసుకువచ్చారు. మూడు సంవత్సరాలైనా ఈనాటికీ స్టే వెకేట్ చేయించడం లేదు. మాది అరణ్యరోదనగానే మిగిలిపోతున్నది. మీ ద్వారా గౌరవ మంత్రిగారిని ఆ స్టే వెకేట్ చేయించి వారికి పోస్టులు ఇప్పించాల్సిందిగా కోరుతున్నాను.

**శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం:** ఇదే సభలో ఏపీపీయస్సీ ద్వారా విశ్వవిద్యాలయలో నియామకాలను భర్తీ చేస్తామంటే విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తికి నష్టం వస్తుందని తెలిసినా కూడా మేమందరం అంగీకరించాము. ఏకోన్ముఖంగా ఏపీపీయస్సీ ద్వారా నియామకాలను చేపట్టమని చెప్పాము. ఆంధ్రప్రదేశ్ తరువాత మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇదే పని చేసింది. మనకంటే ఆలస్యంగా నోటిఫికేషన్ ఇచ్చి మధ్యప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం పోస్టులన్నీ భర్తీ చేసింది. అక్కడ ఏ ప్రభుత్వమున్నదనేది అనవసరం. అక్కడ కూడా కోర్టు కేసులు వచ్చాయి. అక్కడ కూడా లిటిగేషన్లు వచ్చాయి. అక్కడ కూడా చాలా వ్యవహారాలు జరిగాయి. కానీ అక్కడ ప్రభుత్వాలు వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని పోస్టులు భర్తీ చేసుకున్నాయి. ఇక్కడెందుకు జరగదు? రకరకాల లిటిగేషన్లు వస్తే వాటిని ఎదుర్కోవడానికి మీ దగ్గర

యంత్రాంగం, ప్లానింగ్ ఉండాలి తప్ప కోర్టు స్టే వచ్చింది కాబట్టి మేము భర్తీ చేయలేకపోతున్నామంటే ఈ సమాధానంలో ఏం పాయింట్ ఉన్నది?

ఉ.10.50

అధ్యక్షా, నిన్న కూడా వాళ్లు ధర్నా చేశారు. విశ్వవిద్యాలయాల్లో చాలా ప్రతిభావంతులైన వారు ఎంపిక కాబడి ఉద్యోగాలకు గౌరవప్రదంగా పోకుండా ధర్నాలు చేస్తుంటే, అంటే ధర్నాలో కూడా వారు నెగ్గితేనే వారికి ఉద్యోగాలు ఇస్తారా? ఇప్పుడు అక్కడ ఆ పరిస్థితి వచ్చింది. ఈ విషయంలో ఉన్నత విద్యామండలి అభిమన్యుడి మాదిరిగా మారిపోయిందని నేనైతే చాలా స్పష్టంగా చెబుతున్నాను. ఆ సంస్థ ఒంటరి పోరాటం చేస్తోంది. ఆ సంస్థకు మద్దతు కూడా పెద్దఎత్తున లేదని నేను అభిప్రాయపడుతున్నాను. కోర్టు కేసులను వెంటనే పరిష్కరించుకుని వారికి న్యాయం చేయాలి. ఎందుకంటే, రేపో, ఎల్లుండో ఎన్నికల షెడ్యూలు వచ్చేసే విధంగా ఉంది. ఆ తర్వాత మీరు ఇవ్వలేరు. మరెవరో ఇవ్వవలసిన పరిస్థితి ఉత్పన్నం కావచ్చు. మరో ఐదారు నెలలు వాయిదాపడే పరిస్థితి రావచ్చు. కోర్టు కేసులను ఉపసంహరించుకునే విధంగా చేసి వారం లేదా పదిరోజుల్లో ఇంటర్వ్యూలను నిర్వహించడానికి చర్యలు మేము తీసుకుంటామనే హామీ కావాలి తప్ప నాన్చుడు వ్యవహారం మాదిరిగా మాట్లాడితే మాకైతే తృప్తి లేదు. ఖచ్చితంగా ఉన్నత విద్యాశాఖకు ఆ సపోర్ట్‌ను రాజకీయం ద్వారా కూడా ఇవ్వాలని, ఆ విధంగా ఇచ్చి ఆ పోస్టులను వెంటనే భర్తీచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తమరిద్వారా నేను ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఈ విధంగా ఉంటే విశ్వవిద్యాలయాలు ఎలా బ్రతుకుతాయి? ఎవరంటే వారు కోర్టులకు వెళ్లి ఏదో ఒక స్టే ఆర్డరు తెస్తే, ప్రభుత్వం వారికి పాదాక్రాంతం అవుతుందా? ఇది చాలా అన్యాయం. ప్రభుత్వం ఈవిషయంలో గట్టిగా అనుకుంటే చేయగలదని నేను అభిప్రాయపడుతున్నాను.

**శ్రీ రాము సూర్యారావు:** అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారు మరియు మానవ వనరుల శాఖమంత్రి గారు కూడా గురువులకు సత్కారాలు చేసి వారిని చాలా గౌరవిస్తున్నారు. మా ఫ్లోర్‌లీడర్ గారు చెప్పినట్లు ఆచరణలో విశ్వవిద్యాలయం అధ్యాపకులంటే చాలా గౌరవం కలిగిన వ్యక్తులు. వారు ఎన్ని అర్హతలు సాధించారనేది సభ్యులు శ్రీ రామకృష్ణ గారు కూడా చెప్పారు. వారికి వెంటనే పోస్టింగులు ఇవ్వవలసిందిగా తమరిద్వారా గౌరవ ముఖ్యమంత్రి గారికి నేను విజ్ఞప్తిచేస్తున్నాను.

**మిస్టర్ చైర్మన్:** విప్‌లు లిస్టు తీసుకుని సభ్యులతో మాట్లాడించాలి. ప్రతి విషయానికి విప్‌లు మాట్లాడడం అనేది కరెక్టు కాదు.

**శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి:** అధ్యక్షా, రాష్ట్రంలో 14 విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం, విక్రమపురి విశ్వవిద్యాలయం, యోగివేమన విశ్వవిద్యాలయం, రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఇటీవల కాలంలో అద్భుతంగా అభివృద్ధి చేశారు, కృతజ్ఞతలు. కానీ, వీటికి

ఇంటర్వ్యూలను జరుపుకోవడానికి ఎటువంటి అభ్యంతరం లేదు. కానీ, కోర్టు కేసుల వల్ల వాటిని ఆపుతున్నారు. మిగిలిన 11 విశ్వవిద్యాలయాల్లో ఎ.పి.పి.ఎస్.సి. నిర్వహించిన స్క్రీనింగ్ టెస్ట్‌కు హాజరయ్యారు. వాటిపై ఉన్న స్టే ఉత్తర్వులను వెకేట్ చేయడంలో నిర్లిప్తత ఉన్నట్లుగా అనిపిస్తుంది. గత 10 సంవత్సరాలుగా విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ మరియు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉండడం వల్ల పరిశోధన పూర్తిస్థాయిలో కుంటుపడి పోయింది. కాబట్టి స్టే ఉత్తర్వులను వెకేట్ చేయడం కోసం ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో తెలియజేయవలసిందిగా తమరిద్వారా నేను మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ బి.ఎన్.రాజసింహులుః** అధ్యక్షా, చిత్తూరులో ఎస్.పి.సావిత్రమ్మ మహిళా కళాశాల ఉంది. ఆ కళాశాలలో 500 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. ఆ కళాశాలలో 31 మందికి కేవలం 8 మంది అధ్యాపకులు మాత్రమే ఉన్నారు. మేము ఇటీవల అక్కడకు వెళ్లి చూస్తే అక్కడ చాలా ఇబ్బందికర పరిస్థితి ఉంది. దయచేసి ఆ కళాశాలకు స్టాఫింగ్ ప్యాటర్న్ ఇవ్వాలని తమరిద్వారా నేను మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ డొక్కా మాణిక్య వర ప్రసాద్ః** అధ్యక్షా, మన శాసనసభ, పార్లమెంటు, కోర్టుల మాదిరిగానే విశ్వవిద్యాలయాలు కూడా సొసైటీని రిప్రజెంట్ చేసే సంస్థలు. శాసనపరిషత్తులో అన్ని సామాజికవర్గాలు రిప్రజెంట్ చేసే విధంగా ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారు చర్యలు తీసుకుంటున్నారు. అదేవిధంగా, శాసనసభలో కూడా అన్ని సామాజికవర్గాలు రిప్రజెంట్ చేసి వారి వాయిస్ వినిపించాలనేది గౌరవ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడుగారి ఉద్దేశం. శ్రీ చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వం వచ్చిన తర్వాత విశ్వవిద్యాలయాల్లో ఇంతవరకూ రిక్రూట్‌మెంట్ జరగలేదు. కానీ, విశ్వవిద్యాలయాల్లో జరిగే నియామకాల్లో అన్ని సామాజికవర్గాలకు న్యాయం జరిగే విధంగా ఒక పాలసీ నిర్ణయాన్ని తీసుకోవాలి. లేకపోతే కొన్ని సామాజికవర్గాలు పీట వేసుకుని మిగిలినవారిని ఎవరినీ రానీయకుండా ఒక గ్యాంగ్‌లా తయారవుతున్నాయి. అది మన భారతదేశానికి, ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. అందువల్ల సమాజంలో ఉండే అన్ని వర్గాలకు కూడా మెరిట్-కమ్-వెయిటేజి ఉండాలి. అటువంటి పాలసీ ఏదైనా తీసుకుంటే విశ్వవిద్యాలయాలు బాగుపడతాయని తమరిద్వారా నేను ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

**శ్రీ గంటా శ్రీనివాసరావుః** అధ్యక్షా, గౌరవసభ్యులు శ్రీ ఎ.ఎస్.రామకృష్ణగారు, శ్రీమతి పామిడి శమంతకమణి గారు, శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం గారు, శ్రీ రాము సూర్యారావు గారు, శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి గారు, శ్రీ బి.ఎన్.రాజసింహులు గారు, శ్రీ డి. మాణిక్యవరప్రసాద్ గారు విశ్వవిద్యాలయాలకు సంబంధించిన పోస్టుల భర్తీ విషయంలో మాట్లాడడం జరిగింది. 2014 సంవత్సరంలో నూతనంగా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యారంగానికి ఎక్కువ బడ్జెట్‌ను కేటాయించడమే కాకుండా రాష్ట్రాన్ని ఒక నాలెడ్జ్ స్టేట్‌గా, ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చడం కోసం అనేక సంస్కరణలు తీసుకురావడం జరిగింది. ముఖ్యంగా, విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయాలంటే ఫ్యాకల్టీ మరియు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎంతో ప్రధానమని ఆ రెండు అంశాలపై ప్రధాన నిర్ణయాలు తీసుకుని ఆగస్టు, 2015 సంవత్సరంలో మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాఘవులు గారి ఆధ్వర్యంలో ఒక కమిటీని నియమించి విశ్వవిద్యాలయాల్లో ఎంతమంది

ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు మరియు ఇతర పోస్టులు అవసరమవుతాయని ఒక నివేదిక ఇవ్వాలని కోరితే, 100 మంది ప్రొఫెసర్లు, 175 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 1100 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు కలిపి మొత్తం 1375 మందిని రిక్రూట్‌మెంట్ చేయాలని ఆ కమిటీ నివేదికను ఇవ్వడం జరిగింది. సభ్యులు శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం గారు ఇంతకుముందు చెప్పినట్లు అసిస్టెంటు ప్రొఫెసర్ల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది కాబట్టి ఆ పోస్టుల రిక్రూట్‌మెంట్ కోసం తొలిసారిగా ఒక స్క్రీనింగ్ టెస్ట్‌ను నిర్వహించి, ఎవరికైతే బేసిక్‌గా అర్హతలు ఉంటాయో వారిని మాత్రమే ఇంటర్వ్యూలకు పిలిచి ఎంపిక చేయాలనే ఒక కొత్త నిర్ణయాన్ని తీసుకున్నప్పుడు అందరూ ఎంతో సపోర్ట్ చేశారు. ఆవిధంగా ఎ.పి.పి.ఎస్.సి. ద్వారా ఒక స్క్రీనింగ్ టెస్ట్‌ను నిర్వహించాము. మొత్తం 1100 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులకు 21457 మంది అభ్యర్థులు స్క్రీనింగ్ టెస్ట్‌కు హాజరయ్యారు. వారిలో 3240 మంది క్వాలిఫై అయ్యారు. ఆ 3240 మంది అభ్యర్థులను సంబంధిత విశ్వవిద్యాలయాలు ఇంటర్వ్యూలకు పిలిచి ఎంపిక చేసుకునే విధంగా ప్రొసీజర్‌ను పెట్టడం జరిగింది. అదేవిధంగా, అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్ల పోస్టుల కోసం డైరక్టుగా విశ్వవిద్యాలయాలు ఇంటర్వ్యూలను నిర్వహించడం జరుగుతోంది. రాష్ట్రంలో ఉన్న 14 విశ్వవిద్యాలయాల్లో కొన్ని విశ్వవిద్యాలయాలు ఇంటర్వ్యూలను నిర్వహించి, ఫలితాలు ప్రకటిస్తే కొంతమంది వచ్చి జాయిన్ అయ్యారు. ఫలితాలను ప్రకటించక ముందే కోర్టు డైరక్షన్ రావడం వల్ల కొన్ని విశ్వవిద్యాలయాలు ఫలితాలను ప్రకటించలేకపోయాయి. కొన్ని విశ్వవిద్యాలయాల్లోని వైస్ ఛాన్సలర్లు పదవీవిరమణకు సమీపంలో ఉండడం వల్ల ఇంటర్వ్యూలను నిర్వహించలేకపోయాము.

అధ్యక్షా, ప్రధానంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి సంబంధించి విశ్వవిద్యాలయాల వారీగా రెండు, మూడుసార్లు షెడ్యూలు కూడా ఇవ్వడం జరిగింది. అనుకోకుండా కోర్టు కేసులు రావడం, యు.జి.సి. కూడా ఒక డైరక్షన్ ఇవ్వడం జరిగింది. మధ్యప్రదేశ్‌లో రిక్రూట్‌మెంట్ చేసినట్లు సభ్యులు శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం గారు ఇంతకుముందు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున ఉన్నత విద్యామండలి మరియు డిపార్టుమెంటు కూడా కోర్టు కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించి రిక్రూట్‌మెంట్‌ను పూర్తిచేయాలని అనేక రకాలుగా ప్రయత్నించడం జరుగుతోంది. గత 10 లేక 15 సంవత్సరాల నుంచి రిక్రూట్‌మెంట్ చేయలేదు. మన ప్రియతమ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి విద్యారంగం పట్ల ఉన్న ప్రత్యేకశ్రద్ధ వల్ల ప్రత్యేకంగా కేబినెట్ సమావేశాన్ని ఏర్పాటుచేసి ఆ పోస్టులన్నింటినీ ఆమోదించి మంజూరు చేయడం జరిగింది. అలాగే, కేపిటల్ గ్రాంటు కూడా రూ.285కోట్లు కొత్త విశ్వవిద్యాలయాలకు ఇచ్చి వాటిని ప్రోత్సహించడం జరుగుతోంది. ఈరోజు కూడా మా శాఖ కార్యదర్శులతో మాట్లాడి కోర్టుకేసులు, యు.జి.సి. డైరక్షన్స్ ఉన్నప్పటికీ మనం ఏ విధంగా చేయవచ్చో ఒక లీగల్ ఒపీనియన్‌ను తీసుకోవాలని చెప్పడం జరిగింది. లీగల్ ఒపీనియన్ తీసుకున్న తర్వాత వేరే మార్గం ఏదైనా ఉంటే తప్పకుండా ఆ రిక్రూట్‌మెంట్‌ను వీలైనంత త్వరగా పూర్తిచేస్తామని తమద్వారా నేను గౌరవసభ్యులకు తెలియజేస్తున్నాను.

## ఆరోగ్య వైద్యశాఖకు నిధులు

ప్రశ్న నెం. 10929 (6)

సర్వశ్రీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, వెన్నపూస గోపాల్ రెడ్డి, గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎం.ఎల్.సి.లు

గౌరవనీయులైన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) వైద్య, ఆరోగ్యశాఖకు 2018-19, 2017-18, 2016-17, 2015-16, 2014-15 సంవత్సరాలలో కేటాయించిన నిధుల పరిమాణం మరియు విడుదల చేసిన నిధులు, అందులో ఖర్చుచేసిన మొత్తాల వివరాలేమిటి;

ఆ) ఎన్.టి.ఆర్. ఆరోగ్య పథకం (ఆరోగ్యశ్రీ) క్రింద 2018-19, 2017-18, 2016-17, 2015-16, 2014-15 సంవత్సరాలలో కేటాయించిన నిధుల పరిమాణం మరియు విడుదల చేసిన నిధులు, అందులో ఖర్చుచేసిన మొత్తాల వివరాలేమిటి;

ఇ) ఎన్.టి.ఆర్. ఆరోగ్య (ఆరోగ్యశ్రీ) పథకాన్ని పటిష్ట పరచడానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలేమిటి?

**గౌరవనీయులైన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి (శ్రీ ఎన్.ఎం.డి.ఫరూక్):**

అ) వైద్య ఆరోగ్యశాఖకు 2018-19, 2017-18, 2016-17, 2015-16, 2014-15 సంవత్సరాలలో కేటాయించిన నిధుల పరిమాణం మరియు విడుదల చేసిన నిధులు, ఖర్చుచేసిన మొత్తాల వివరాలు క్రింది విధంగా ఉన్నాయి:

(రూ. కోట్లలో)

| సంవత్సరం | బడ్జెటు | వ్యయం |
|---|---|---|
| 2014-15 | 4387.94 | 4839.06* |
| 2015-16 | 5728.23 | 5069.02 |
| 2016-17 | 6103.76 | 6331.63 |
| 2017-18 | 7020.63 | 6140.67 |
| 2018-19 | 8463.51 | 6427.95* |

(*ఓటాన్ అకౌంట్ బడ్జెటు)

(**24.01.2019 నాటికి)

శాఖాధిపతులందరికి సమగ్ర బడ్జెట్ పంపిణీ వ్యవస్థ ద్వారా బడ్జెట్‌ను పంపిణీ చేసినందున వ్యయం చేసేందుకు నిర్దిష్ట విడుదల ఏదీ అవసరం లేదు. కేటాయింపును విడుదలగా పరిగణించడమవుతుంది. కేటాయింపు ప్రకారం ప్రతి త్రైమాసికంలో ఖర్చుచేసేందుకు శాఖాధిపతులకు స్వేచ్ఛ ఉంటుంది.

ఆ) డా. ఎన్.టి.ఆర్. వైద్య సేవా ట్రస్టు క్రింద సంవత్సరం వారీగా కేటాయించిన, విడుదల చేసిన మరియు ఖర్చు చేసిన నిధుల వివరాలను అనుబంధం ఒకటిగా జతపరచడమయింది.

ఇ) డా. ఎన్.టి.ఆర్. వైద్య సేవా పథకాన్ని పటిష్టపరచడం కోసం ప్రభుత్వం చేపట్టిన చర్యలను అనుబంధం రెండుగా జతపరచడమయింది.

## అనుబంధం – I

డా. ఎన్‌టిఆర్ వైద్య సేవా పథకం క్రింద 2018-19, 2017-18, 2016-17, 2015-16, 2014-15 లో కేటాయించిన నిధుల పరిమాణం మరియు అందులో విడుదలచేసిన, ఖర్చుచేసిన నిధుల మొత్తం వివరాలు క్రింది విధంగా ఉన్నాయి.

| వరుస సంఖ్య | ఆర్థిక సంవత్సరం | పథకం పేరు | | విడుదల చేసిన పూర్తి మొత్తం (విఎస్-I+విఎస్-II) (రూపాయలలో) | మొత్తం వ్యయం |
|---|---|---|---|---|---|
| | | డా. ఎన్‌టిఆర్ వైద్య సేవా పథకం రెగ్యులర్ బడ్జెట్ (విఎస్ – I) | ముఖ్యమంత్రి సహాయనిధి (విఎస్-II) | | |
| 1. | 2014-15 | 500,00,00,000 | 247,86,00,000 | 747,86,00,000 | 869,66,93,698* |
| 2. | 2015-16 | 500,00,00,000 | 160,00,00,000 | 660,00,00,000 | 1003,57,10,125* |
| 3. | 2016-17 | 1301,96,00,000 | 100,00,00,000 | 1401,96,00,000 | 963,64,36,150* |
| 4. | 2017-18 | 1000,00,00,000 | ఏమీలేవు | 1000,00,00,000 | 1083,14,14,91,151* |
| 5. | 2018-19 | 1000,00,00,000 | 0 | 1000,00,00,000 | 1147,02,96,868** |
| | | మొత్తం | | 48,09,82,00,000 | 50,67,06,27,992 |

*ఆయా సంవత్సరాలలో బడ్జెటు కేటాయింపు నుండి మరియు పిడి ఖాతాలో లభ్యంగా ఉన్న గత సంవత్సరపు మిగులు నుండి వ్యయాన్ని ఖర్చుచేయడమయింది.

** 2018-19 ఆర్థిక సంవత్సరానికి బడ్జెటు కేటాయింపు రూ. 1000.00 కోట్లు, 2018-19 ఆర్థిక సంవత్సరానికి విడుదల చేసిన మరియు వ్యయం మొత్తాన్ని 24-01-2019 న చేపట్టడమయింది.

## అనుబంధం – 2

**ఎన్‌టిఆర్ వైద్య సేవ పథకాన్ని పటిష్ట పరిచేందుకు చేపట్టిన చర్యలు మరియు డా. ఎన్‌టిఆర్ వైద్య సేవ క్రింద ప్రత్యేక సాఫల్యతలు**

01. కార్య విధానాలు చేర్చడం :- రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, 2014 సంవత్సరంలో బిపిఎల్ కుటుంబాలకు మరిన్ని ఆరోగ్య సేవలను అందించేందుకు డా.ఎన్.టిఆర్ వైద్య సేవా పథకం క్రింద ప్రస్తుతమున్న 944 కార్యవిధానాలకు 102 కొత్త కార్యవిధానాలను చేర్చింది. డా.ఎన్.టిఆర్ వైద్య సేవ క్రింద మొత్తం 1046 కార్యవిధానాలు ఉన్నాయి.

02. ఆర్థిక పరిమితి పెంచడం :- ఆర్థిక ప్రయోజన వర్తింపును పెంచేందుకు 2014 లో ఒక్కో కుటుంబానికి సంవత్సరానికి ఆర్థిక పరిమితిని రూ.2.00 లక్షల నుండి రూ.2.50 లక్షల వరకు ప్రభుత్వం పెంచింది.

    బిపిఎల్ కుటుంబాలన్నింటి కోసం 01-04-2019 నుండి ఒక్కో కుటుంబానికి సంవత్సరానికి ఆర్థిక పరిమితిని రూ. 2.50 లక్షల నుండి రూ. 5.00 లక్షల వరకు పెంచాలనే ప్రతిపాదన పరిశీలనలో ఉంది.

03. బిపిఎల్ లబ్ధిదారులను చేర్చడం :- ప్రభుత్వం 14.63 లక్షల బిపిఎల్ లబ్ధిదారులను గుర్తించింది. మరియు డా.ఎన్‌టిఆర్ వైద్య సేవా పథకంలో ట్రస్టును చేర్చడమయింది.

04. కీలక నిర్వహణా సూచికలు మరియు సంతృప్తి కరమైన నిర్వహణ : రియల్ టైం గవర్నెన్స్ (ఆర్‌టిజిఎస్) మరియు 104 కాల్ సెంటర్లు డా.ఎన్‌టిఆర్ వైద్య సేవా పథకం యొక్క అమలు నిమిత్తం 88 శాతం మరియు 94 శాతం సంతృప్తి నివేదికను నమోదుచేశాయి.

05. ప్యాకేజ ధరలను పెంచడం :-

    27-09-2018 తేదీగల జి.ఓ.ఎం.ఎస్ నెం.187 ద్వారా ప్రభుత్వం డా.ఎన్‌టిఆర్ వైద్య సేవ క్రింద ప్యాకేజి ధరలను 2.62 శాతం పెంచింది.

06. ఎన్‌టిఆర్‌విఎస్ మరియు ఇహెచ్‌ఎస్ క్రింద గుండె మార్పిడి శస్త్ర చికిత్స :-
తదనంతర చికిత్స కోసం రూ.4.00 లక్షలతో బఫర్ మొత్తంగా రూ.10.50 లక్షలు + రూ. 50,000/-ల ప్యాకేజీ రేటుతో ఎస్ 19 క్రింద కేటగిరీ ప్రకారం గుండె మార్పిడి శస్త్ర చికిత్స కోసం చికిత్స ప్రోటోకాల్స్ మరియు ప్యాకేజి రేట్లను ట్రస్టు రూపొందించింది. గుండె మార్పిడి కోసం నోడల్ కేంద్రంగా ఉన్నట్టి గుంటూరు జిజిహెచ్ లో డా.ఎన్‌టిఆర్‌విఎస్ క్రింద ముగ్గురు లబ్ధిదారులు గుండె మార్పిడి శస్త్ర చికిత్సను చేయించుకున్నారు.

07. డా.ఎన్‌టిఆర్ వైద్య సేవ క్రింద చికిత్స పొందిన డయాలసిస్ రోగులకు పింఛన్లు :-
సెర్ప్ శాఖ ద్వారా డా.ఎన్‌టిఆర్ వైద్య సేవ క్రింద ప్రభుత్వ & ప్రైవేటు ఆసుపత్రులు రెండింటిలో చికిత్స పొందిన డయాలసిస్ రోగుల కోసం ప్రభుత్వం రూ. 2,500/- ల పింఛన్‌ను సమకూర్చుతున్నది.

08. ఆసుపత్రులను జాబితాపరచడం :- ట్రస్టు, విభజన తర్వాత, హైదరాబాదు నుండి ఆరోగ్య సేవల వికేంద్రీకరణకు మరియు ట్రస్టు యొక్క వివిధ పథకాల క్రింద లబ్ధిదారులందరి కోసం ప్రత్యేకంగా రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలలోని వారికి సేవలు విస్తరించేందుకు సులభంగా అందుబాటులో ఉంచేందుకు మరిన్ని ఆసుపత్రులను జాబితాలో చేర్చింది.

జాబితా కూర్పు స్థాయి క్రింది విధంగా ఉంది.

- సిహెచ్.సి లు మరియు ఏరియా ఆసుపత్రులతో సహా ప్రభుత్వ ఆసుపత్రుల జాబితా 79 నుండి 256 వరకు పెరిగింది.
- మొత్తం ప్రైవేటు ఆసుపత్రుల సంఖ్య 279 నుండి 440 కు పెరిగింది.
- డా.ఎన్‌టిఆర్ వైద్య సేవ క్రింద మొత్తం ప్రభుత్వ ఆసుపత్రుల సంఖ్య 358 నుండి 696 కు పెరిగింది.
- మొత్తం నెట్ వర్క్ ఆసుపత్రుల సంఖ్య 910. (214 దంత వైద్యశాలలతో సహా)

- "తల్లి సురక్ష" అమలు కొరకు 10 పడకల ప్రసూతి (ప్రసూతి శాస్త్రం) ఆసుపత్రుల జాబితా కూర్పు జరుగుతున్నది.

09. కోక్లియర్ (మధ్యచెవి) అమరిక శస్త్ర చికిత్స కొరకు వయో పరిమితి పెంపుదల :-
2016 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలతో 2 నుండి 5 సంవత్సరాల వరకు కోక్లియర్ అమరిక శస్త్ర చికిత్స కొరకు గరిష్ట వయో పరిమితిని ట్రస్టు పెంచింది.

10. ఆసుపత్రుల ఎన్ఏబిహెచ్ ఎన్క్యుఏల గుర్తింపు :-
ఎన్క్యుఏల క్రింద 61 ఎన్ఏబిహెచ్ గుర్తింపు పొందిన ప్రైవేటు మరియు ఎన్.ఎక్యుల గుర్తింపు పొందిన 8 ప్రభుత్వ ఆసుపత్రులు ఉన్నాయి.

11. అనంతపురము, కడప మరియు చిత్తూరు వంటి పొరుగు రాష్ట్రాల రోగుల అవసరాలను తీర్చేందుకు కర్ణాటక రాష్ట్రం బెంగుళూరులోని వైదేహి వైద్య కళాశాల అనే పేరుగల ఆసుపత్రిని జాబితాలో చేర్చడమయింది.

12. ఆయుష్మాన్ భారత్-పిఎంజెఎవై :- సంవత్సరానికి ఒక్కొక్క కుటుంబానికి రూ. 5,00,000/-ల ఆర్థిక కవరేజితో 1350 ప్రోసీజర్ల కొరకు ఎస్ఇసిసి 2011 క్రింద గుర్తించిన బిపిఎల్ కుటుంబాలన్నింటికీ కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య బీమా పథకాన్ని ప్రారంభించింది. రాష్ట్రంలో సదరు పథకాల అమలు కొరకు డా.ఎన్.టిఆర్ వైద్య సేవా ట్రస్టు ఒక నోడల్ ఏజెన్సీగా ఉంది. తల్లి సురక్షతో పాటు ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం వద్ద కేంద్ర ప్రభుత్వ ఏబిపిఎం – జెఎవై సిఇఓ సమక్షంలో కేంద్ర ప్రభుత్వంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మరియు 30-12-2018 తేదీన గౌరవ ముఖ్యమంత్రి గారు పథకాన్ని ప్రారంభించారు.

13. తల్లి సురక్ష (ప్రసూతి ప్రోసీజర్లతో కలుపుకొని) :- ఒక లక్ష సజీవ జననాలకు 65 నుండి 50 వరకు ప్రసూతి మరణాల రేటును తగ్గించేందుకు గాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 30-12-2018 తేదీన "తల్లి సురక్ష"ను ప్రారంభించింది. మరియు 15-01-2019 నుండి ఆన్‌లైన్ లో ఉంచడమయింది. సిజిహెచ్ఎస్ 2014 రేట్లతో

సమానంగా బిపిఎల్ లబ్ధిదారులకు డా.ఎన్.టిఆర్ వైద్య సేవా పథకం క్రింద నగదు రహిత ప్రసూతి సేవలను అందించడం తద్వారా ప్రభుత్వ ఆసుపత్రులపై భారాన్ని తగ్గించడం ఈ పథకం యొక్క ఉద్దేశ్యం.

డా.ఎన్‌టిఆర్ వైద్య సేవ క్రింద కొత్త ప్రసూతి (డెలివరీలు) ప్రొసీజర్లు చేరి ఉంటాయి :-

| వరుస సంఖ్య | ప్రొసీజర్ పేరు | ప్యాకేజ రేటు |
|---|---|---|
| 01. | నార్మల్ డెలివరి | రూ. 8,000/- |
| 02. | సిజేరియన్ సెక్షన్ | రూ. 14,050/- |

14. డా.ఎన్‌టిఆర్ క్యాన్సర్ కేర్ ట్రస్టు : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 09-04-2018 తేదీగల ఆరోగ్య వైద్య & కుటుంబ సంక్షేమ శాఖ జి.ఓ.ఆర్.టి నెం.126 ద్వారా టాటా ట్రస్టు మరియు ఇతర కన్సార్టియం భాగస్వాముల భాగస్వామ్యంతో డా. ఎన్‌టిఆర్ క్యాన్సర్ ట్రస్టును ఏర్పాటు చేయడమయింది.

టాటా మెమోరియల్ ట్రస్ట్ మరియు ప్రభుత్వ భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సమగ్ర క్యాన్సర్ కేర్ సేవలను అందించడమే ట్రస్టు యొక్క లక్ష్యం. డా. ఎన్‌టిఆర్ క్యాన్సర్ కేర్ ట్రస్టుతో అవగాహన ఒప్పందాలన్ని కుదుర్చుకోవడమయింది. లక్ష్యాలు క్రింది విధంగా ఉన్నాయి.

- ట్రస్టు క్రింద డా. ఎన్‌టిఆర్ క్యాన్సర్ కేర్ నిర్వహణ లేదా ఏవేని ఇతర పథకాలను ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని ఏర్పాటు చేసి, సమకూర్చి, నిర్వహించి, నవీకరించి, అమలు చేయడం మరియు పర్యవేక్షించడమే ఈ ట్రస్టు యొక్క ముఖ్య ఉద్దేశము, లక్ష్యం.

- ఆంధ్రప్రదేశ్ జిల్లాలన్నింటిలో సమగ్ర క్యాన్సర్ కేర్‌ను సమకూర్చేందుకు ట్రస్టు క్యాన్సర్ కేర్ సంస్థలను (సిసిఐ) ఏర్పాటు చేస్తుంది. ప్రస్తుతం లేదా ప్రతిపాదిత సిసిఐ లేని జిల్లాలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.

15. విభజన తరువాత రూ. 9,07,01,300/-ల మొత్తంతో మెస్సర్స్ ఎపిఎంఎస్ఐడిసి ద్వారా బిపిల్ లబ్ధిదారులందరికి 1.24 కోట్ల కొత్త డా. ఎన్‌టిఆర్ వైద్య సేవాఆరోగ్య కార్డులను ముద్రించి, పంపిణీ చేయడం.

16. అవగాహన మరియు ఐఇసి కార్యకలాపాలు :-

ప్రభుత్వం ద్వారా వివిధ పథకాలను అమలు చేయడం గురించి, సమాజంలో అంటు వ్యాధులు కాని వాటి గురించి ప్రజలలో అవగాహనను కల్పించడానికి గాను ట్రస్టు ఈ క్రింది కార్యకలాపాలను ప్రారంభించింది.

ఎ. డా. ఎన్‌టిఆర్ వైద్య సేవ క్రింద విజయగాథలపై 07 డాక్యుమెంటరీ సంక్షిప్త చిత్రాల కోసం మొత్తం రూ. 31,48,232/-లు ఖర్చు చేయడమయింది.

బి. చక్కెర వ్యాధి, రక్తపోటు, ఊబకాయం, రక్తహీనతలపై తెలుగు మరియు ఆంగ్ల భాషలు రెండింటిలో పద్యాలతో పాటు సంక్షిప్త వీడియో చిత్రాలను తీయడం కోసం రూ. 28,32,200/- ల మొత్తాన్ని ఖర్చు చేయడమయింది.

ఉ.11.00

**మిస్టర్ డెప్యూటీ చైర్మన్:** ఉదయం 11.45 ని.లకు బడ్జెట్ ప్రజంటేషన్ ఉంటుంది. ఇప్పుడు 11 గం.లు అయ్యింది. ఇంకా రెండు ప్రశ్నలున్నాయి. త్వరగా పూర్తిచెయ్యండి.

<u>లంక గ్రామాలలో పి.హెచ్.సిలు</u>

ప్రశ్న నెం.10802(7)

శ్రీమతి అంగూరి లక్ష్మి శివ కుమారి, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన గిరిజన సంక్షేమ మరియు సాధికారత శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) తూర్పు గోదావరి జిల్లాలోని ప్రతి లంక గ్రామానికి పిహెచ్‌సిలను ఏర్పాటు చేసేందుకు ఏవైనా చర్యలు తీసుకోవడమవుతున్నదా;

ఆ) అయితే, లంక గ్రామాలలో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటి?

గౌరవనీయులైన ప్రాథమిక ఆరోగ్యం మరియు కుటుంబ సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి (శ్రీ కిడారి శ్రావణ్‌కుమార్):

అ) లేదండీ.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

**శ్రీమతి అంగూరి లక్ష్మీ శివకుమారి (శాసనసభా నియోజకవర్గం):** అధ్యక్షా, మనకు తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో లంక గ్రామాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. లంక గ్రామాలు అనేసరికి ఎక్కడో చిన్న చిన్న లంకల్లో నివాసం ఉంటున్నారు. అయితే ఎలాంటి సదుపాయాలు లేని పరిస్థితిలో వారు ఉంటున్నారు. ఆ ప్రాంతాల ప్రజలలో ఎవరికైనా ఆరోగ్యపరమైన ఇబ్బందులు వచ్చినప్పుడు అందుబాటులో మందులు లేకపోవడం, ఒకవేళ జ్వరం వస్తే ఎక్కడో ఉన్న ఆసుపత్రికి వెళ్ళేసరికి మధ్యలోనే ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఆ లంక గ్రామాలలో ఉంది. ముఖ్యంగా అక్కడ ఎక్కువగా శారీరకంగా కష్టపడే వారే కాబట్టి పొదల్లోనూ, పొలాల్లోనూ పనిచేసేటప్పుడు ఎక్కువ పాము కాటుకు గురవుతున్న పరిస్థితులు అక్కడ ఉన్నాయి. అయితే వారికి దగ్గర్లో ఎలాంటి వైద్య సదుపాయాలు లేవు. అసలు అందుబాటులో లేని పరిస్థితుల్లో ఎక్కువమంది గర్భిణీ స్త్రీలు, చిన్న పిల్లలు కూడా భయభ్రాంతులై ఉండడం జరుగుతోంది. కాబట్టి వీరికి వైద్యం అనేది అందుబాటులోకి వచ్చే విధంగా గౌరవనీయులైన మంత్రివర్యులు చర్యలు తీసుకోవాల్సిందిగా మీద్వారా కోరుతున్నాము. ముఖ్యంగా ఇక్కడ పి.హెచ్.సిల ఏర్పాటు చేయలేకపోయినా సబ్ సెంటర్లయినా పెట్టి వైద్యం అందించాలని మీద్వారా మంత్రివర్యులను కోరుతున్నాను.

**శ్రీమతి టి.రత్నాబాయి (నామినేటెడ్):** అధ్యక్షా, గిరిజన ప్రాంతాల్లో మాతా శిశు మరణాల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. ఇప్పుడు అక్కడ చాలా ఖర్చుపెడుతున్నా ఆ ప్రాంతాలలో గైనకాలజిస్టులను పోస్టు చెయ్యకపోవడం వల్ల చాలామంది చనిపోవడం జరుగుతోంది. ఈ విషయంలో తప్పనిసరిగా అక్కడ గైనకాలజిస్టులను నియమించి మాతా, శిశు మరణాలను అరికట్టాల్సిందిగా మీద్వారా నేను మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ రాము సూర్యారావు:** అధ్యక్షా, నేను కృతజ్ఞతలు చెప్పడానికి మాట్లాడుతున్నాను. మన వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగారు వచ్చిన తరువాత మంత్రిమండలి ఆమోదంతో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి వైద్య కళాశాల మంజూరుచేశారు. ముఖ్యమంత్రిగారికి, మంత్రిమండలి సభ్యులందరికీ మీద్వారా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఎలాగూ కేబినెట్ మంజూరు చేసింది కాబట్టి ఎన్నికల కోడ్ రాకముందే వెంటనే చర్యలు ప్రారంభిస్తే మిగతా కార్యక్రమాలన్నీ కూడా జరిపించుకుంటామని మీద్వారా ముఖ్యమంత్రిగారికి, వైద్య ఆరోగ్య శాఖా మంత్రిగారికి విజ్ఞప్తి చేస్తున్నాను.

**మిస్టర్ డిప్యూటీ చైర్మన్:** 11.45కి బడ్జెట్ ప్రజంటేషన్ ఉంది. క్వశ్చన్ అవర్ త్వరగా పూర్తిచెయ్యండి.

**శ్రీమతి గుమ్మిడి సంధ్యారాణి:** అధ్యక్షా, గిరిజన గ్రామాల్లోని ఆసుపత్రుల్లో స్పెషలిస్టు వైద్యుల కొరత చాలా ఎక్కువగా ఉంది. చిన్నపిల్లల వైద్య నిపుణులు కానీ, గైనకాలజిస్టులు కానీ అక్కడ ఉండడంలేదు. మంత్రిగారు అరకు ప్రాంతం నుంచి వచ్చారు కాబట్టి వారికి కూడా అక్కడి సమస్యలు తెలుసు. యువకులు, విద్యావంతులు, పైగా గిరిజనులు కాబట్టి మంత్రిగారు ఇన్ని రోజులుగా చూస్తున్నారు కాబట్టి వారికీ తెలుసు. ఈ మధ్య కాలంలో వైజాగ్‌లో జరిగిన సమావేశంలో అడిగినా గిరిజన ప్రాతాలకు గైనకాలజిస్టులు కానీ, చిన్నపిల్లల వైద్య నిపుణులు రావడంలేదని చెప్తున్నారు. ఆ సమాధానం కరెక్టు కాదేమోనని అనిపిస్తోంది. నెల, రెండు నెలల పాటు అక్కడే ఉండే విధంగా ఒక్కో వైద్యుడ్ని అక్కడకు పంపిస్తే బాగుంటుంది. ఆ గిరిజన ప్రాంతాల్లోని ఆసుపత్రుల్లో గర్భిణీ స్త్రీల కోసం, చిన్నపిల్లల కోసం స్పెషలిస్టులను వేయమని తమద్వారా కోరుకుంటూ, అలాగే సాలూరుకు 100 పడకల ఆసుపత్రి మంజూరు చేశారని ముఖ్యమంత్రిగారు ఆల్‌రెడీ చెప్పారు. ఎన్నికల కోడ్ రాకముందే దానికి కూడా శంకుస్థాపన చేయాల్సిందిగా కోరుకుంటున్నాము.

**శ్రీ కిడారి శ్రావణ్‌కుమార్:** అధ్యక్షా, గౌరవ సభ్యులు అడిగినట్లు లంక గ్రామాల్లో ప్రత్యేకంగా హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగింది. అక్కడ కేంద్ర సర్వీసులుకానీ, ప్రతి వెయ్యిమంది జనాభా ఎక్కడ ఉంటుందో అక్కడ హెల్త్‌వర్కర్లను, ఆశా వర్కర్లను నియమించి వారికి శిక్షణ ఇవ్వడం కూడా జరిగింది. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, పిల్లలకు సేవలందించడానికి శిక్షణ ఇచ్చాము. గౌరవ సభ్యులు చెప్పినట్లు వారడిగిన ప్రశ్నకి గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లోని పి.హెచ్.సిల్లో కూడా 24/7 సేవలు అందించడం జరుగుతుంది. మరి స్పెషలిస్టుల కోసం అడిగినట్లయితే ఈ మధ్యనే మనం రిక్రూట్‌మెంట్ కూడా చేయడం జరిగింది. అక్కడ అధికారులను కూడా నియమించడం జరుగుతుంది. అలాగే గైనకాలజిస్టుల నియామకాలకు కూడా కౌన్సిలింగ్ జరిగింది. ఆ పోస్టులను కూడా త్వరలోనే భర్తీ చేస్తాము. ముఖ్యంగా మనం పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్‌లో కూడా తీసుకోవడం జరుగుతుంది. గైనకాలజిస్టులే కాదు మిగతా స్పెషలిస్టులు ఎక్కడైతే కావాలో అక్కడ మనం భర్తీ చేసే కార్యక్రమాన్ని చేస్తున్నాం.

## రిమ్స్‌లో సి.టి. స్కాన్

ప్రశ్న నెం.10804(8)

సర్వశ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి, విటపు బాలసుబ్రహ్మణ్యం, ఎం.ఎల్.సిలు.,

గౌరవనీయులైన అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమం - వైద్య విద్య శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) ఒంగోలులోని రిమ్స్ ఆసుపత్రికి సి.టి స్కాన్ ను మంజూరు చేయడమయిందా ;

ఆ) సదరు సి.టి. స్కాన్ పనిచేయని విషయం వాస్తవమేనా ;

ఇ) అయితే, సమస్యను పరిష్కరించడానికి తీసుకుంటున్న చర్యలేమిటి?

**గౌరవనీయులైన అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమం - వైద్య విద్య శాఖ మంత్రి (శ్రీ ఎన్.ఎం.డి ఫరూక్):**

అ) అవునండీ.

ఆ) అవునండీ.

ఇ) ఆసుపత్రిలో ప్రస్తుతమున్న పాత సి.టి స్కాన్ యంత్రం 10 సంవత్సరాల కంటే ఎక్కువ పాతది. ప్రస్తుతం అది పని చేయడం లేదు. పిపిపి విధానం క్రింద కొత్త యంత్రాన్ని ఏర్పాటు చేయడానికి 07-07-2017 తేదీగల ఆరోగ్య, వైద్య - కుటుంబ సంక్షేమ (హెచ్) శాఖ జి.ఓ.ఎం.ఎస్ నెం.385 ద్వారా ప్రభుత్వం ఉత్తరువులను జారీ చేసింది. కోర్టు కేసును దృష్టిలో ఉంచుకుని యంత్రాన్ని ఏర్పాటు చేయవలసి ఉంది. పిటీషనర్లలో ఒకరు 21-12-2018 తేదీ గల 2018 లోని డబ్ల్యు.పి.నెం. 3875 ను ఉపసంహరించుకోవడమయింది. గౌరవ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సమక్షంలో 28-01-2019 తేదీగల మరొక డబ్ల్యు.పి.నెం.622 ను దాఖలు చేయడమయింది. అందువల్ల, కోర్టు కేసు పరిష్కారమైన తరువాత పరికరాన్ని ఏర్పాటు చేయడమవుతుంది.

ఒకవేళ సి.టి. స్కాన్ యంత్రం ఏర్పాటు చేసేదాకా అక్కడ వైద్య సేవల కోసం ఎవరైతే పేషెంట్లు వస్తారో వారికి ప్రైవేటు ఆసుపత్రి ద్వారా కూడా ఉచిత సేవలు అందిస్తామని గౌరవ సభ్యులకు మీద్వారా తెలియజేస్తున్నాను.

**శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి:** అధ్యక్షా, ఇటీవల ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి వెళ్ళడం జరిగింది. ప్రతిరోజూ దాదాపుగా 1500 నుంచి 1700 వరకూ పేదలు ఓ.పికి అటెండ్ అవుతున్నారు. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్‌తో సి.టి. స్కాన్‌ను మంజూరు చేశారు. అలా చేయాల్సిన అవసరముందా? ఆ ఇష్యూ మీద కోర్టుకు వెళ్లగా కోర్టు స్టే ఇచ్చింది. ఇంకొక కోర్టుకు వెళ్తే ఆ స్టే వెకేట్ చేసింది. అంతా కూడా చాలా గందరగోళంగా ఉంది. రోజుకు 1700 వరకూ ఓ.పి వస్తున్న ప్రతిష్టాత్మకమైన రిమ్స్ ఆసుపత్రి, మెడికల్ కళాశాల టీచింగ్ ఆసుపత్రి అయిన కళాశాలకు ప్రభుత్వమే మంజూరు చేయాలని మీద్వారా మంత్రివర్యులను కోరుతున్నాను.

**శ్రీ ఎన్.ఎం.డి ఫరూక్:** అధ్యక్షా, **ఈ కేసు కోర్టులో ఉంది.** అది ఏమైనా సరే, గౌరవ సభ్యులు అడిగినట్లుగా ఒంగోలులో తప్పకుండా సి.టి. స్కాన్ ఏర్పాటు చేస్తాము.

**MR. DEPUTY CHAIRMAN :** Next Question No.10828 (9) is postponed at the request of the Member.

## అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రాథమిక సదుపాయాలు

ప్రశ్న నెం.10817 (10)

శ్రీమతి పోతుల సునీత, ఎం.ఎల్.సి.

గౌరవనీయులైన మహిళాభ్యుదయం మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) రాష్ట్రంలో ప్రస్తుతమున్న 55,000 అంగన్‌వాడీ కేంద్రాలకు గాను 7,453 కేంద్రాలలో మరుగు దొడ్డి సౌకర్యాలు, 4,569 కేంద్రాలలో త్రాగునీటి సౌకర్యం మరియు 3101 కేంద్రాలలో విద్యుత్తు సౌకర్యం లేనందు వల్ల అంగన్‌వాడీ కేంద్రాలలోని పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా;

ఆ) అయితే, ఈ విషయంలో తీసుకున్న చర్యలేమిటి ;

ఇ) అంగన్‌వాడీ కేంద్రాల అద్దెబిల్లు చెల్లింపులో జాప్యాన్ని నివారించడానికి తీసుకుంటున్న చర్యలేమిటి?

**గౌరవనీయులైన మహిళా, శిశు, విభిన్న ప్రతిభావంతులు - వయోవృద్ధుల శాఖ మంత్రి (శ్రీమతి పరిటాల సునీత):**

అ) లేదండి. రాష్ట్రంలో 55,607 అంగన్‌వాడీ కేంద్రాలు (ఎడబ్ల్యుసిలు) ఉన్నాయి. అందులో 53,347 కేంద్రాలు మరుగుదొడ్డి సౌకర్యం కలిగి ఉన్నాయి. త్రాగునీటి సౌకర్యాలను అన్ని కేంద్రాలకు సమకూర్చడమయింది. 54,951 కేంద్రాలు త్రాగునీటి కనెక్షన్లు కలిగి ఉన్నాయి. 54,784 కేంద్రాలు విద్యుత్తు సౌకర్యాన్ని కలిగి ఉన్నాయి. మిగిలిన 2,260 కేంద్రాలలో మరుగుదొడ్డి సౌకర్యం, మిగిలిన 656 కేంద్రాలలో త్రాగునీటి కనెక్షన్లు మరియు మిగిలిన 823 కేంద్రాలలో విద్యుత్తు సౌకర్యానికి సంబంధించి జిల్లాలలో మంజూరు చేయడమయింది. అవి పురోగతిలో ఉన్నాయి.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

ఇ) అంగన్‌వాడీ కేంద్రాల అద్దెల చెల్లింపులలో జాప్యాన్ని నివారించడానికి ప్రధాన కార్యాలయం నుండి సిఎఫ్ఎంఎస్ ద్వారా 2018, నవంబరు నుండి భవన యజమానుల బ్యాంక్ ఖాతాలకు నేరుగా ఎడబ్ల్యుసిల అద్దె బిల్లులు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

**ఉ.11.10**

**శ్రీమతి పోతుల సునీత (శాసనసభా నియోజకవర్గం):** అధ్యక్షా, గౌరవ మంత్రివర్యులు మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు లేవని చెప్పారు, చాలా సంతోషం. కానీ ఆరు నెలల క్రితం మహిళా శిశు సంక్షేమం మరియు వికలాంగుల కమిటీ తరఫున ఉభయగోదావరి జిల్లాలలో పర్యటించాము. అక్కడ కొన్ని ప్రాంతాలలో అద్దె భవనాలలో అంగన్‌వాడీ కేంద్రాలను నడుపుతున్నారు. అక్కడ మరుగుదొడ్లు, త్రాగునీటి సమస్యలు

ఉన్నాయి. కొన్నిచోట్ల భవనాలు ఉన్నా వాటికి ప్రహరీగోడలు లేవు. 2018 నుండి భవనాలు లేని చోట అద్దెభవనాలకు అద్దెలు చెల్లిస్తున్నామని మంత్రిగారు చెప్పారు.

రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటర్లలో బాలామృతం మరియు గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం అందించి వారి ప్రసవానికి చర్యలు తీసుకుంటూ మాతా శిశుమరణాల రేటు తగ్గించుటకు మన రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నది, చాలా సంతోషం. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న "అన్న అమృతహస్తం", "బాలామృతం" పథకం ద్వారా ఇస్తున్న పోషకాహారంలో గ్రేడింగ్ విధానం కూడా ఉంది. "సి" కేటగిరి, "డి" కేటగిరిలలో ఉన్న ప్రాజెక్టుల కేంద్రాలనుండి వస్తున్న సరకులు పక్కదారి పట్టకుండా అసలైన లబ్ధిదారులైన చిన్నారులు, బాలింతలు, గర్భిణీ స్త్రీలకు అందాలంటే సూపర్‌వైజర్లు, సిడిపిఓలు పూర్తి బాధ్యత తీసుకోవాలి.

మరొక అంశమేమంటే గౌరవ ముఖ్యమంత్రిగారు అంగన్‌వాడీ వర్కర్ల కనీసవేతనం రూ.10,500/-కు పెంచడం జరిగింది. అదేవిధంగా వారికి సామాజిక భద్రతా సౌకర్యాలైన ఇఎస్ఐ, పిఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని 2013లో ఐఎల్ఓ సిఫారసు చేసింది. వీటి అమలుకు తగు చర్యలు తీసుకోవాలని మీద్వారా మంత్రివర్యులను కోరుతున్నాను.

**శ్రీ బొడ్డు నాగేశ్వర రావు:** అధ్యక్షా, ఒక్క నిమిషం మాట్లాడడానికి అవకాశం ఇవ్వండి.

**మిస్టర్ డెప్యూటీ చైర్మన్:** 11.15కు టీ బ్రేక్ ఉంటుంది, 11.45కి మంత్రిగారు బడ్జెట్ ప్రవేశపెడతారు, **no supplementary.** మంత్రిగారూ, సమాధానం ఇవ్వండి.

**శ్రీమతి పరిటాల సునీత:** అధ్యక్షా, గతంలో అంగన్‌వాడీ కేంద్రాలను పట్టించుకున్న పాపాన పోలేదు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గౌరవ ముఖ్యమంత్రిగారు అంగన్‌వాడీలకు "వెలుగు" అనే ఒక కార్యక్రమాన్ని పెట్టి ప్రతి అంగన్‌వాడీ కేంద్రం శుభ్రంగా ఉండాలని పెయింటింగ్స్ వేయించడం, మరుగుదొడ్లు నిర్మించడం, లైటింగ్, ఫ్యాన్ల వంటి సౌకర్యాలను కల్పిస్తున్నారు. ఈ సౌకర్యాలన్నీ అన్ని కేంద్రాలలో ఈ నెలాఖరుకల్లా పూర్తిచేస్తామని మీద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాము. అదేవిధంగా "సి" కేటగిరి, "డి" కేటగిరిలలో ఉన్న ప్రాజెక్టులలో సిడిపిఓ అధికారులతో తనిఖీయించడం జరిగింది. "బాలామృతం", "అన్న అమృతహస్తం" పథకాలు చాలా చక్కగా నిర్వహించబడుతున్నాయి. గుడ్లు, పాలు అందజేస్తున్నాము. "అన్న అమృతహస్తం" పథకంవల్ల ప్రతి గర్భిణీ స్త్రీ ఎంతో ఆనందంగా ఉన్నారు. పుట్టబోయే పిల్లలు కూడా చాలా ఆరోగ్యంగా ఉంటున్నారు. అంతేకాకుండా రాష్ట్రం విడిపోయిన తరువాత "బాలామృతం" పథకం నిర్వహించడం చాలా ఇబ్బందికరంగా ఉంటే గౌరవ ముఖ్యమంత్రిగారి చొరవ వలన అదికూడా నెలకు 2.5కేజీల వరకూ సరఫరా చేస్తున్నాము. ఆ పథకం కూడా చాలావరకు విజయవంతం అయ్యిందని మీద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

**MR.DEPUTY CHAIRMAN:** Question Hour completed.

## 2.**PAPERS LAID:**

MR. DEPUTY CHAIRMAN: Papers included in the agenda are deemed to have been laid on the Table of the House.

**PAPERS LAID ON THE TABLE OF THE HOUSE:**

1) "A copy of the 9th Annual Report of **the Overseas Manpower Company Andhra Pradesh Limited for the** Year 2014-15 as required under Rule 619-A of the Companies Act, 1956".

2) "A copy of the 2nd Annual Report of the Andhra Pradesh Urban Greening and Beautification Corporation Limited for the Year 2016-17 as required under Section 394 of the Companies Act, 2013".

3) "A copy of the 43rd Annual Report of the Andhra Pradesh State Irrigation Development Corporation Limited for the Year 2016-17 as required under Section 394(2) of the Companies Act, 2013".

4) "A copy in each of the Annual Reports of the Andhra Pradesh Brahmin Welfare Corporation for the Years 2014-15, 2015-16 and 2016-17 as required under Section 394 of the Companies Act, 2013".

5) "A copy in each of the Notifications issued in G.O.Ms.No.57, Transport, Roads & Buildings (Tr.1), dated 1st November, 2018 and G.O.Ms.No.70, Transport, Roads & Buildings (Tr.1), dated 27th December, 2018 as required under Section 9(2) of the Andhra Pradesh Motor Vehicles Taxation Act, 1963".

MR. DEPUTY CHAIRMAN: Now, Special Mention. Srinivasulu Reddy garu.

## 3.ప్రత్యేక ప్రస్తావన

**శ్రీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి:** అధ్యక్షా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీరాజ్, గవర్నమెంట్ ఉపాధ్యాయులకు సంబంధించిన ఏకీకృత సర్వీస్ రూల్స్‌లో లోకల్ కేడర్ ఫెసిలిటీ లేదని చెప్పి అది పెండింగ్‌లో ఉంది. రాష్ట్రపతి ఉత్తర్వులు కూడా పొందిన తరవాత తెలంగాణా రాష్ట్ర హైకోర్టులో ఏపి యునైటెడ్ సర్వీస్ రూల్స్‌ను కొట్టివేయడం జరిగింది. దానిమీద సుప్రీంకోర్టుకు వెళితే సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. ఈ స్టే ఇచ్చిన అవకాశాన్ని మన రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ తక్షణం ఉపయోగించుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వంలో దాదాపుగా రెండు దశాబ్దాలుగా అన్ని మానిటరింగ్ పోస్టులు, డైట్ కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్స్, ఎమ్.ఇ.ఓ పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. ఇది రెండు దశాబ్దాల సమస్య. గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారే ఉమ్మడి సర్వీస్ రూల్స్ అప్పుడు ఇచ్చారు. ఇప్పుడు

వారే జోక్యం చేసుకుని యుద్ధ ప్రాతిపదికమీద పదోన్నతులు, సర్వీస్ రూల్స్ అమలుచేసే ప్రక్రియను చేపట్టవలసిందిగా ప్రత్యేక ప్రస్తావన ద్వారా కోరుతున్నాను.

**MR. DEPUTY CHAIRMAN:** Tea-Break for 15 Minutes.

(The House then adjourned at 11.16 a.m.)

ఉ.11.40

(తేనీటి విరామానంతరం సభ ఉ.11.44ని.లకు ప్రారంభమైనది.)

(గౌరవ డిప్యూటి చైర్మన్ అధ్యక్ష స్థానం వహించారు.)

<u>3). 2019–2020 సంవత్సరానికి వార్షిక ఆదాయ, వ్యయ పట్టిక (బడ్జెట్) (ఓట్ ఆన్ అకౌంట్) సమర్పణ:</u>

**మిస్టర్ డిప్యూటి చైర్మన్:** పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డా. పి నారాయణ 2019–2020 సంవత్సరానికి వార్షిక ఆదాయ, వ్యయ పట్టిక (బడ్జెట్) (ఓట్ ఆన్ అకౌంట్)ను సమర్పిస్తారు.

2019–20 ఆర్థిక సంవత్సరానికి గాను ఆంధ్రప్రదేశ్ శాసనమండలికి

ఓట్–ఆన్–అకౌంట్ బడ్జెట్ సమర్పిస్తూ 5 ఫిబ్రవరి, 2019న

గౌరవనీయ ఆర్థికశాఖామాత్యులు శ్రీ యనమల రామకృష్ణుడుగారి తరఫున

గౌరవనీయ పురపాలక శాఖామాత్యులు డా.పి.నారాయణ చేసిన ప్రసంగం

(బడ్జెట్ ప్రసంగ పాఠాన్ని గౌరవ మంత్రివర్యులు సభకు చదివి వినిపించారు.)

**మిస్టర్ డిప్యూటి చైర్మన్:** రేపు అనగా 6 ఫిబ్రవరి, 2019 బుధవారం నాడు ఉదయం 10.00 గంటలకు సమావేశమగుటకు సభను వాయిదావేయడమైనది.

(The House then adjourned at 01.22 p.m. to meet again at 10.00 a.m. on Wednesday, the 6th February, 2019.)

* * *

**"Published under Rule 316 of the Rules of Procedure and Conduct of Business in the Andhra Pradesh Legislative Council and printed at the AP Legislative Assembly Press, Velagapudi, Amaravati.**